10CTR1:10CTR1.qxd 7/9/2026 11:31 PM Page 1



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కాణిపాకం ఆలయంలో ఛైర్మన్ విస్తృత తనిఖీలు



కాణిపాకం, జులై 9 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో పాలకమండలి ఛైర్మన్ సి.మణినాయుడు బోర్డు సభ్యులతో కలసి గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రధాన ఆలయంలోని కళ్యాణోత్సవ చదివింపుల కౌంటర్, లడ్డు ప్రసాదం కౌంటర్‌తో పాటు లడ్డు పోటు, పడితరం స్టోర్, గణేష్ సదన్(వందగదుల సత్రం), నిత్యఅన్నదాన సత్రం, అన్నదానం చదివింపుల కౌంటర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కౌంటర్లలోని రికార్డులను తనిఖీ చేశారు. అలాగే లడ్డుపోటులో లడ్డు తయారీ విధానంను, లడ్డు ప్రసాదం నాణ్యతను ఛైర్మన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు శివప్రసాద్, నరేష్‌లతో పాటు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో భక్తుల అవసరాలకనుగుణంగా పనులు

### -శ్రీవారి బ్రహ్మోత్సవాలపై అదనపు ఈఓ చౌదరి

తిరుమల, జులై 9ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు భక్తుల అవసరాలకనుగుణంగా ఇంజనీరింగ్ పనులు చేపట్టాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీల్లో భక్తులకు సమస్యలు తలెత్తకుండా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవాలని సూచించారు. తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలపై తిరుమలలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సూచనలు చేశారు.

## నమ్మకాన్ని నిలబెడతారా? నిరాశపరుస్తారా?

ప్రభాతవార్త-తిరుపతి:

సిఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో రాష్ట్రంలోనే ఎంతో ప్రాధాన్యత ఉన్న తిరుపతి నియోజకవర్గ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. టిడిపి తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జిగా జె.బి. శ్రీనివాస్ నియామకంతో ఆయన పార్టీలో సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ నేతలను కలవడం, కేడర్ ఉన్న నేతలను జెబినే స్వయంగా వెళ్ళి పలకరించి వారితో పార్టీ బలోపేతం గురించి చర్చించడం జరుగుతోంది. ఆయన తాజాగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైసిపి కీలక నేతల్లో కూడా కొంత గుబులు పట్టుకుందనేది తిరుపతిలో హాట్‌టాపిక్. ఈ నేపథ్యంలో ఆయన వ్యవహారశైలిపై కొన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ అధినేత ఆయనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతారా? కార్యకర్తలను నిరాశపరుస్తారా? అనే ప్రశ్న ఇప్పుడు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ మొదలైంది. జులై 3న తిరుపతి ఇన్‌ఛార్జిగా నియమితులైన తరువాత వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడువైసిపి తిరుపతి సమన్వయ కర్త భూమన అభినయ్ రెడ్డిల రాజకీయాలకు గట్టి చెక్ పెడతారని టిడిపి శ్రేణులు ఆశించాయి. అయితే ఇప్పటి వరకు జెబి శ్రీనివాస్ వారి పేరును కూడా ప్రస్తావించకపోవడం వెనుక ఆంతర్యమేమిటనేది చర్చగా మారింది.



అంతేగాక గతంలో భూమన కుటుంబానికి సన్నిహితంగా ఉన్న కొందరు నాయకులు ఏకంగా స్వయంగా జెబి నివాసానికి వెళ్లి అభినందనలు తెలియజేయడం మరింత ఆసక్తి రేపుతోంది. తాజాగా మంగళవారం వైసిపి ఎస్సీ సెల్ నేత రాజేంద్ర తన అనుచరులతో కలిసి జెబిని ఘనంగా సత్కరించడం టిడిపి కార్యకర్తల్లో మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. గతంలో ఇదే రాజేంద్ర సిఎం చంద్రబాబుతో పాటు యువనేత నారాలోకేశ్‌పై ,కొందరు టిడిపి నాయకులపై తీవ్ర విమర్శలు చేసిన విషయం కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు. మరోవైపు, గతంలో భూమన కుటుంబంపై టిడిపి చేసిన ఆరోపణలను కూడా పార్టీ శ్రేణులు గుర్తుచేస్తున్నాయి. 2021లో ఎంపి ఉప ఎన్నికల సమయంలో, ఆ తరువాత నగరపాలకసంస్థ ఎన్నికల సమయంలో ఆయన వ్యవహారశైలిపై ఇప్పుడు టిడిపి వర్గాల్లో చర్చ మొదలైంది. దొంగ ఓట్లు, టిడిఆర్ బాండ్ల వ్యవహారం, తిరుమల లడ్డూ వివాదం, భూ ఆక్రమణలు, నగరంలో అరాచకాలు వంటి అంశాలపై టిడిపి తీవ్ర విమర్శలు చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా పలువురు నేతలు ప్రకటించారు. అయితే జెబి బాధ్యతలు చేపట్టి ఐదు రోజులు గడిచినా భూమన కుటుంబంపై ఎలాంటి ఘాటు వ్యాఖ్యలు చేయకపోవడం, అదే సమయంలో వారి అనుచరుల చేత సన్మానాలు స్వీకరించడం పార్టీ క్యాడర్‌ను అయోమయానికి గురిచేస్తోందని అంటున్నారు. ఈ పరిణామాలపై కొందరు టిడిపి సీనియర్ నేతలు సంబంధిత ఫొటోలు, వివరాలను పార్టీ అధిష్ఠానానికి పంపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు తిరుపతి రాజకీయాల్లో వినిపిస్తున్న ఒక్క ప్రశ్న ఇదే... చంద్రబాబు నమ్మకాన్ని జెబీ శ్రీనివాస్ నిలబెడతారా? లేక భూమన కుటుంబంతో రాజీ రాజకీయాలకు తెరతీస్తారా? రానున్న రోజుల్లో ఆయన వైఖరే ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వనుంది.

### ప్రమాదాలకు కారణం

## ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల నిర్లక్ష్యమేనా!

### యూటర్న్ ఏర్పాటు చేయాలని గ్రామస్తుల ధర్నా





పూతలపట్టు, జూలై 9 ప్రభాతవార్త

చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిపై పి.కొత్తకోట బస్టాండ్ సమీపంలో గురువారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోటుగనుమ గ్రామానికి చెందిన కృష్ణయ్య, లలితమ్మ దంపతులు తిరుపతి నుంచి వచ్చి పి కొత్తకోట వద్ద ఉదయం బస్సు దిగి జాతీయ రహదారి దాటుతుండగా ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లలితమ్మ మృతి చెందారు. కృష్ణయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పి కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ఇదివరకే 9 మంది మృతి చెందారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ గ్రామస్తులు గురువారం ధర్నా నిర్వహించారు. స్థానికుల కథనం ప్రకారం, గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. తిరుపతి వైపు వెళ్తున్న వాహనాలు ఆసుపత్రికి చేరుకోవాలంటే వేము కళాశాల వరకు వెళ్లి అక్కడ యూటర్న్ తీసుకుని తిరిగి రావాల్సి వస్తోంది. అలాగే చిత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు వెళ్లి యూటర్న్ తీసుకుని ఆసుపత్రికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ కారణంగా అత్యవసర సమయంలో విలువైన సమయం వృథా అవుతోందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా వెంటనే యూటర్న్ ఏర్పాటు చేయాలని, రోగులు, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నేతాజీ నాయుడు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో చర్చించి సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద యూటర్న్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో గ్రామస్తులు కార్యకర్తలు తమ ధర్నాను విరమించుకున్నారు.

## అక్రమ ఇసుక, మట్టి త్రవ్వకాలపై ప్రత్యేక నిఘా



సూళ్లూరుపేట, జూలై 9 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు నాయుడుపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో అక్రమంగా మట్టి, ఇసుక, గ్రావెల్ తవ్వకాలు, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు నాయుడుపేట డీఎస్పీ జీ. చెంచుబాబు వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు, సూళ్ళూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ, తడ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. కొండప్ప నాయుడుల పర్యవేక్షణలో ఇప్పటికే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. సూళ్ళూరుపేటలోని ఇలుపురు గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వుతున్న జెసిబి, ట్రాక్టర్లను, అలాగే తడ పరిధిలో మాంబట్టులో కూడా అక్రమ తవ్వకాల్లో పాల్గొన్న జెసిబిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు. ఈ అక్రమ రవాణాకు సంబంధించిన వాహనాలను, యంత్రాలను స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యల కోసం కోర్టుకు సమర్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలు, ఇళ్ల నిర్మాణం లేదా ప్రభుత్వ పనుల నిమిత్తం మట్టిని తరలించాల్సి వస్తే, తప్పనిసరిగా సంబంధితశాఖల నుండి ముందస్తు అనుమతులు పొందాలని డీఎస్పీ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ చెరువుల నుండి అయితే పంచాయతీ రాజ్ శాఖ, ఇరిగేషన్ చెరువుల నుండి అయితే ఇరిగేషన్‌శాఖ, రెవెన్యూ భూములైతే ఎమ్మార్వో కార్యాలయం నుండి అనుమతులు పొందాలని అన్నారు. అనుమతులు పొందిన తర్వాత, ప్రభుత్వం నియమించిన ఏజెన్సీ ద్వారానే, రాయల్టీ చెల్లించి చట్టబద్ధంగా రవాణా చేయాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా రవాణా చేస్తే, సంబంధిత అధికారులు ఇచ్చే రిపోర్టుల ఆధారంగా వాహనాలను, మెషీన్లను స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రెండు మండలాల్లో మరో రెండు రోజుల పాటు

## ర్యాంపులు కొనసాగింపు



చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:

రైతుల నుండి తోతాపురి మామిడి కొనుగోలుకు జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన ర్యాంపులను తొలగించినప్పటికీ బంగారుపాళ్యం, తవణంపల్లి, ఐరాల మండలాల్లోని మామిడి ర్యాంపులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మరో రెండు రోజుల పాటు కొనసాగిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వర్ తెలిపారు. జిల్లాలో మామిడి రైతుల నుండి తోతాపురి మామిడిని కొనుగోలు చేయడానికి వివిధ మండలాల్లో 52 ర్యాంపులు ఏర్పాటు చేస్తే ర్యాంపుల నిర్వాహకులు మామిడి రైతుల నుండి తోతాపురి మామిడిని కేజీకి రూ.3కు కొనుగోలు చేస్తుండటంతో మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వర్ కొన్ని ర్యాంపులను తనిఖీ చేశారు. ఈ మేరకు ర్యాంపుల్లో కేజీ తోతాపురి రూ.3కే ర్యాంపుల నిర్వాహకులు మామిడి రైతుల నుండి కొనుగోలు చేస్తుండటంతో మార్కెటింగ్ ఎడి పరమేశ్వర్ ఈ విషయంను కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన ర్యాంపులను బుధవారం సాయంత్రానికి మూసి వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బంగారుపాళ్యం, తవణంపల్లి మండలాల పరిధిలో మామిడి దిగుబడి అధికంగా వుండటంతో ఈ రెండు మండలాల్లోని ర్యాంపులను శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ అనుమతి ఇచ్చారు. అయితే ప్రస్తుతం తవణంపల్లి, బంగారుపాళ్యం మండలాలతో పాటు ఐరాల మండల పరిధిలో సైతం మామిడి దిగుబడి ఇప్పటికీ రైతుల నుండి అధికంగా వస్తుండటంతో ఈ మూడు మండలాల్లోని ర్యాంపులను మరో రెండు రోజుల పాటు కొనసాగించడానికి కలెక్టర్ అనుమతించినట్లు మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వర్ తెలిపారు. బంగారుపాళ్యంలోని సూర్య ర్యాంపును గురువారం మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ర్యాంపు నిర్వాహకులు మండల పరిధిలో తోతాపురి మామిడి దిగుబడి అధికంగా వుండటంతో తమ మండలంలో వున్న ర్యాంపులను మరో రెండు రోజుల పాటు కొనసాగించాలని కోరారు. అలాగే ఐరాల, బంగారుపాళ్యం, తవణంపల్లి మండలాల్లోని తోతాపురి మామిడి ర్యాంపుల నిర్వాహకులు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ దృష్టికి సమస్యను తీసుకెళ్ళడంతో ఆయన సైతం కలెక్టర్‌తో ఈ విషయంపై చర్చించి తోతాపురి మామిడి అధికంగా వుండటంతో మరో రెండు రోజుల పాటు ర్యాంపులు కొనసాగించడానికి అనుమతించాలని కోరారు.

## పునాదులు తీస్తుండగా వినాయక విగ్రహం లభ్యం

వి.కోట, జూలై 9 ప్రభాతవార్త

ఆవును కట్టేందుకు గుత్తులు నాటేందుకోసం పునాదులు తీస్తుండగా పురాతన వినాయక విగ్రహం లభ్యమైంది. ఈసంఘటన పత్రపల్లిలో చోటు చేసుకుంది. గ్రామంకు చెందిన సుబ్బన్న తన సొంత స్థలంలో గడ్డపారతో భూమిని తవ్వగా రాతి వినాయక విగ్రహం బయటపడింది. దీంతో ఆయన కుటుంబీకులు, గ్రామస్తులు విగ్రహంకు పూజలు చేశారు. ఈ విగ్రహాన్ని చూసేందుకు జనం అధిక సంఖ్యలో వస్తున్నారు.



పునాదుల్లో లభ్యమైన విగ్రహం

## తిరుపతిలో నేరాల భయం

### -జంట హత్యకేసులో అదుపులో అనుమానితులు



తిరుపతి, జులై 9ప్రభాతవార్త:

ప్రశాంత తిరుపతి నగరంలో నేరాలు జనాన్ని భయపెడుతూన్నాయి. తాజాగా తిరుచానూరు మార్గంలోని పద్మావతి కల్యాణమండపాల ప్రాంగణంలో పాతకక్షల నేపథ్యంలో ఇద్దరు దారుణ హత్యకు గురవడం సంచలనంగా మారింది. ఈ హత్య కేసు పై తిరుపతి ఈస్ట్ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇప్పటికే ఈకేసులో అనుమానితులు సునీల్,వాసు మరో మహిళను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. నిందితులు ఏర్పేడు మండలం జంగాలపల్లి కి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. తిరుమలలో పనిచేసే సంపూర్ణమ్మ ఆమె కుమార్తెను సునీల్‌తో వివాహం జరిపింది. కొద్ది నెలల క్రితం కారణం చెప్పకుండా భార్యను సునీల్ వదిలేయడం ఈ హత్యకు కారణాలుగగా మారింది. హత్యకు గురైన మునిరత్నంయాదవ్, మణికంఠల మృతదేహాలకు పోస్టమార్టమ్ నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాలను అప్పగించారు. ఈ సంచలనంలో సునీల్ ,వాసుల విచారణలో వెల్లడించే విషయంపై తదుపరి పోలీసులు చర్యలు తీసుకోనున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో... సామూహిక అక్షరాభ్యాసం

### -చిన్నారులచే ఓనమాలు దిద్దించిన ఎంఎల్‌ఏ





సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొని చిన్నారులకు ఓనమాలు దిద్దుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఇఓ, హాజరైన తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలోని శ్రీ గురుదక్షిణామూర్తి సన్నిధిలో గురువారం ఉదయం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విద్యారంభానికి శుభప్రదమైన ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా స్థానిక ఆచారం మేరకు కలశ స్థాపన గావించారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ కలశ పూజలు నిర్వహించారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి పర్యవేక్షణలో వేదపండితులు వేద మంత్రాలను పఠించారు. సుమారు 200 మంది చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని అక్షరాభ్యాసం చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డితో కలిసి చిన్నారులకు తన చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు. బియ్యం పళ్లెంలో ఓనమాలు దిద్ది చిన్నారులకు తొలి అక్షరం పరిచయం చేశారు. అనంతరం చిన్నారులకు పట్టణంలోని పెట్రోల్ బంకు యజమాని మహేష్ అందించిన పుస్తకాలు, పెన్నులు, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అక్షర రూపంలో ఉన్న ఆ పరమశివుని మరియు శ్రీగురు దక్షిణామూర్తి స్వామి వారి అనుగ్రహంతో మన పిల్లలందరూ విద్యా బుద్ధులతో ఉన్నతంగా రాణించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి కే వెంకటేశ్వర్లు , డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, అర్చకులు, సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్ సంకల్పం చేయించారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల బోర్డు తెలుగుదేశం, బిజెపి సభ్యులు కె.నాగరాజు, జి.గోపినాథ్, డి.లక్ష్మమ్మ, బిజెపికి చెందిన వైశాలి, శైలజలు పాల్గొన్నారు. ఏర్పాట్లును డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓ హేమామాలిని, లోకేష్‌బాబు విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషనం యాదవ్, టెంపుల్ ఇన్స్ పెక్టర్ వెంకటస్వామి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వేదాంతపురంలో భూ రగడ

### స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతంలో ఉద్రిక్తత





తిరుపతిరూరల్,జూలై 9 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం వేదాంతపురంలో స్వర్ణముఖి నది పరివాహ ప్రాంతంలో భూ వివాదం మళ్లీ ముదిరి...ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. సర్వేనెంబర్ 251లో వున్న నదీపోరంబోకు భూమిని ఆక్రమించేందుకు ఇరువర్గాలు పోటాపోటీగా రంగంలోకి దిగడంతో గ్రామం రణరంగంగా మారింది. గతంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించామని వైసిపి నాయకులు పేర్కొంటుండగా, పేదల పేరుతో అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని అధికార పార్టీ నాయకులు తీవ్ర ఆరోఫణలు చేశారు. పేదల కోసం స్థలాలు పంఫిణి జరుగుతుండగా అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకుని 'మా తరపన కూడా పేదలకు ఇళ్ల ఇస్తాం' అంటూ పోటీకి దిగడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఇప్పటికే ఆ స్థలంలో ఐదారు నిర్మాణాలు పూర్తయినప్పటికీ, మిగిలిన భూమిని జెసిబితో చదును చేయడానికి ప్రత్నించగా టిడిపి నాయకులు అడ్డుకున్నారు. పార్టీకి సేవ చేసినవారికి, నిజమైన దాల్చి ఇరుపక్షాల మహిళలు కూడా రంగంలోకి దిగి వాగ్వివాదాలకు దిగడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. పరిస్థితి అదుపు తప్పేలా కనిపించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇంత తీవ్రంగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నా...సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. నదీపోరంబోకు భూముల పరిరక్షణ, పేదలకు న్యాయం చేసే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

10 CTR 2:10 CTR 2.qxd 7/9/2026 11:32 PM Page 1



# పిఎంఎజివై పనులు వేగవంతం

## - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:

షెడ్యూల్ కులాల జనాభా అధికంగా వున్న గ్రామాల సమగ్రాభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పన, జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన(పిఎంఎజివై) పథకంలో మంజురైన పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పిఎంఎజివై పథకం పనుల అమలు, నిధుల వినియోగం, పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.10.96 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, ఇందులో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 117 పనులు చేపట్టడానికి రూ.2.45 కోట్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా 287 పనులు చేపట్టడానికి రూ.8.51 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అలాగే జిల్లాలో మొత్తం 404 అభివృద్ధి పనులను ఈ నిధులతో చేపట్టగా వాటిలో 225 పనులు పూర్తి అయ్యాయని, మరో 147 పనులు పురోగతిలో వున్నాయని, 32 పనులు ఇంకా ప్రారంభం కాకపోవడానికి గత కారణాలు ఏమిటని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. అలాగే పూర్తయిన పనులకు సంబంధించి పరిపాలన, సాంకేతిక అనుమతులు, ఒప్పంద ప్రక్రియ, పాస్ ఆర్డర్లు, డిజిటల్ ఎంబుక్ నమోదు, బిల్లుల సమర్పణ, లబ్దిదారుల ఖాతాలకు నిధుల జమ వంటి ప్రతి దశను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో వున్న పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను సత్వరం ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. బిల్లుల సమర్పణలో ఎలాంటి జాప్యం లేకుండా, నిధుల విడుదలకు అవసరమైన అనిన ప్రక్రియలను సమయానికి పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, క్షేత్ర స్థాయిలో తరచు అధికారులు తనిఖీలు నిర్వహించి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగేలా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఒ రవిప్రకాష్‌నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్, గ్రామీణ మంచినీటి సరఫరా అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఎంపిడిఓలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

చిత్తూరుహెల్త్, జులై 9 ప్రభాతవార్త:

చిత్తూరు, తిరుపతి జిల్లాలో పరిధిలోని ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) కాలేజీల్లో ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) కోర్సుల్లో ఉచితంగా రెండు సంవత్సరాల పాటు శిక్షణ పొందడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) శిక్షణా కేంద్రం, తిరుపతిలోని ఎస్‌విఆర్‌ఆర్‌జిజిహెచ్ ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) శిక్షణా కేంద్రం, చిత్తూరులోని శ్రీ శ్రీనివాస ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందడానికి దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఈ శిక్షణకు దరఖాస్తును చేసుకునే మహిళా అభ్యర్థినిలు ఇంటర్మీడియేట్ పాస్ అయి వుండటంతో పాటు 31 డిసెంబర్ 2025 నాటికి 17 సంవత్సరాలు పూర్తి అయి వుండాలన్నారు. అలాగే దరఖాస్తుతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50ను కమీషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఎపి, అమరావతిలో చెల్లుబాటు అయ్యే విధంగా డిడి తీసి సమర్పించాలని, అలాగే ఎస్సీ, ఎస్టీ, బిసీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వుంటుందన్నారు. అభ్యర్థులు సెప్టెంబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ దరఖాస్తులను సంబంధిత కళాశాలలు లేదా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని డిఎంహెచ్ఓ కోరారు.

## ద్రవిడ వర్సిటీలో సంఘం శరణం గచ్ఛామి కార్యక్రమం

### డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన.

కుప్పం,జులై 9 ప్రభాతవార్త



ద్రావిడ విశ్వవిద్యాలయం ఫోక్లోర్ అండ్ ట్రైబల్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే " సంఘం శరణం గచ్ఛామి" కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటలకు వర్సిటీ సుబ్బులక్ష్మి ఆడిటోరియంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయం, లక్ష్యాలపై కళా రూప నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎల్ సి మల్లయ్య హాజరయ్యారు. ఇలాంటి కళారూప నాటకాల ప్రదర్శనలను మరిన్ని వర్సిటీలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇలాంటి ప్రదర్శనలతో మహనీయుల గురించి అవగాహన కల్పించడం ద్వారా స్ఫూర్తిని పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి కిరణ్ కుమార్, డీన్ అకాడమిక్ అఫైర్స్ ఆచార్య కే శ్యామల, ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం మాజీ ఎం పి పి డాక్టర్ వెంకటేష్,గుడుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కుప్పం నియోజకవర్గం ఎస్ సి సెల్ అధ్యక్షులు యల్లప్ప, దళిత నాయకులు,వర్సిటీ బోధన ,బోధనేతర సిబ్బంది విద్యార్థిని ,విద్యార్థులు పరిశోధక విద్యార్థులు హాజరయ్యారు.

## ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే అమర్‌కు ఆహ్వానం

పలమనేరు రూరల్, జులై 9 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ప్రతి నెల నియోజకవర్గాల వారీగా రోటేషన్ పద్ధతిలో నియోజకవర్గ శాసన సభ్యులు మరియు ఇంచార్జ్‌లు నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశానికి విచ్చేయాలని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని పూతలపట్టు శాసన సభ్యులు మురళీ మోహన్ గురువారం ఆహ్వానించారు. ఆ మేరకు పూతలపట్టు నియోజకవర్గ ముఖ్య నేతలతో కలసి పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అమరనాథ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి ఈ దఫా తన నియోజకవర్గంలో నిర్వహించనున్న ఆత్మీయ సమావేశానికి రావాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేను శాలువకప్పి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. సంస్థాగత సమన్వయాన్ని బలోపేతం చేయడం, కమ్యూనికేషన్ ను మెరుగుపరచడం, క్షేత్ర స్థాయి రాజకీయ పరిస్థితులను అంచనా వేయడంతో పాటు పార్టీ కేటాయించిన కార్యక్రమాలు, కార్యాచరణ పై చర్చించడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం. అందులో భాగంగా ఈ నెలలో పూతలపట్టులో ఈ సమావేశం నిర్వహించనున్నారు... ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ నాయకులు దొరబాబు, హరిబాబు నాయుడు, నేతాజీ, ధరణి, నరేష్ తదితరులున్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

### ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్

ఓబులవారిపల్లి, జులై 9 ప్రభాతవార్త



ప్రస్తుత సమాజంలో రోజురోజుకు సైబర్ మోసాలు అధికమై పలువురు సైబర్ నేరాల కింద నలిగిపోతున్నారని ఓబులవారిపల్లి ఎస్ఐ సుజన్ కుమార్ సూచించారు శుక్రవా రం ఓబులవారిపల్లి మండలం చిన్న ఒరం పాడు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అలాగే ప్రధానోపాధ్యాయులకు అధ్యాపకులకు ఆయన సైబర్ నేరాలపై పలు సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు సైబర్ నేరాలకు అట్రాక్ట్ కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు మెసేజ్లు పంపిన వాటిని గుర్తించి పోలీసులు తెలియజేయాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు కాలినడక నడిచి వెళ్లేటప్పుడు చైన్ స్నాక్స్ వ్యక్తుల నుండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపరాదని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలన్నారు, మారకద్రవ్యాలు మత్తు పదార్థాలు నుంచి బాలికలు రక్షణ కలిగి ఉండాలని 112 అత్యవసర సేవలను ఎలా వినియోగించుకోవాలో వాటి గురించి క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులకు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు అధ్యాపకులు విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లి, జులై 9 ప్రభాతవార్త



ఓబులవారిపల్లి మండలం ముక్కువారిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ గౌస్ కుమారుడు షేక్ మహమ్మద్ వధువు నూర్‌ఏఆ ఈస్ వివాహానికి కూడా చైర్మన్ టిడిపి ఇం చార్జ్ ముక్కారూపానందరెడ్డి సతీ మణి ముక్కా వరలక్ష్మి, కూటమి నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.సిగమాల మల్లికా ర్జునరెడ్డి బత్తిని వేణుగోపాల్ రెడ్డి మరియు ముక్కవారిపల్లి నాయకులు ఆలీ సాహెబ్ జమీర్ అక్బర్ ఇస్మాయిల్ మోలా సాహెబ్ మోలానా తదితర కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామీణ ప్రాంతాలలో ఎస్ఐఆర్‌పై వైసీపీ నాయకుల అవగాహన సదస్సు

రైల్వేకోడూరు రూరల్, జులై 9 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లి ఉర్ల గడ్డ పోడు వైఎస్ఆర్ నగర్‌లో వైసీపీ సీనియర్ నాయకులు రామిరెడ్డి ధ్వజ రెడ్డి,తోట శివ సాయిల ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై గ్రా మీణ ప్రాంతాలలో అవగాహన సదస్సును కల్పిస్తున్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ,ఎస్టీలు ప్రత్యేకంగా ఓటర్లు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసుకోవాలని వారు ప్రజలకు సూచించారు. రానున్న రోజుల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కల్పించుకోవాలని అన్నారు. ఇప్పటికే సమయం తక్కువగా ఉన్నందువలన ఓటర్లు వారి వారి ఓటు నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఏమైనా అనుమానాలు ఉంటే ఎంపీపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన సర్పంచులు చంద్రశేఖర్, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, ఆనాల చెంగల్రెడ్డి, గోపి, ఆర్ వి రమణ, నాయిని హరికృష్ణ రెడ్డి, మైనార్టీ నాయకులు ఎస్ కే షఫీ, బత్తలమని, కంభం శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఓటర్లు జాబితాలో ఉండేలా చూడాలి

### - ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, జులై 9 ప్రభాతవార్త



అర్హులైన ఓటర్లు నూతన ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. గురువారం కుప్పం మండలం పైపాళ్యం, గుడుపల్లె మండలం అగరం, శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో ఆయన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, అర్హత లేని వారి ఓట్ల తొలగింపు తదితరాలపై బిఎల్ఎలు దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు సమర్థవంతంగా కార్యక్రమంను పూర్తి చేయాలన్నారు. కుప్పం మండలంలో సర్ పురోగతి 71.73శాతం, గుడుపల్లె మండలంలో 76.38శాతం, శాంతిపురం మండలంలో 71.83శాతం మేర ఉందన్నారు. వందశాతం ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుప్పం మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్ శరవణ, నేతలు కృష్ణమూర్తి, విభూషణ్, మోహన్, గుడుపల్లె అధ్యక్షుడు సుబ్బు, హేమాంబరగౌడు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు - సిఐ

కుప్పం, జులై 9 ప్రభాతవార్త



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం సిఐ మల్లేష్ యాదవ్, గుడుపల్లె ఎస్సై శ్రీకాంత్ కుప్పం పట్టణంలో సిబ్బందితో కలసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు పాటించని పలువురికి జరిమానా విధించారు. అనంతరం కుప్పం బస్టాండ్ వద్ద విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలు..పెద్దలకు ఉచితంగా శ్రీమద్భగవద్గీత శిక్షణ

కుప్పం, జులై 9 ప్రభాతవార్త

కుప్పం పట్టణంలోని శ్రీ సుజ్ఞానంద ఆశ్రమంలో పిల్లలు, పెద్దలకు ఉచితంగా శ్రీమద్భగవద్గీత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని శ్రీ ప్రజ్ఞానంద సరస్వతిస్వామి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6.30-8.30గంటల వరకు సాయంత్రం 5.30-7.30గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈఏడాది గీతా జయంతి పోటీలు శ్రీమద్భగవద్గీతలో ఏడో అధ్యాయంపై నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కుప్పం, జులై 9 ప్రభాతవార్త

కుప్పం -గుడుపల్లె రైల్వేస్టేషన్‌ల మధ్య స్థానిక డంపింగ్ యార్డు సమీపంలో రైలు నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు 35-40 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కుప్పం జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ ఫోన్ నెం 8074088806కు సమాచారం అందించాలని కోరారు.

## కడ పి.డి.చే రోడ్డు విస్తరణకు పరిశీలన

కుప్పం, జులై 9 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో గురువారం కుప్పం పట్టణం కొత్తపేట ప్రాంతాన్ని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సందర్శించారు. ఈసందర్భంగా ఆ ప్రాంతంలో చేపట్టే రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రాంతాలను పరిశీలించారు. కొత్తపేట ప్రాంతంలో నూతనంగా నిర్మించే డిఎస్పీ కార్యాలయం మీదుగా ఎన్టీఆర్ స్టేడియం వరకు రోడ్డు విస్తరణ అవకాశాలను పి.డి. పరిశీలించి నేతలతో చర్చించారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, సిఎం పిఎ శ్రీకాంత్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## అభివృద్ధి..సంక్షేమాలు ప్రజలకు తెలపాలి



రామకుప్పం, జులై 9 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు అధ్వర్యంలో కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమా లను ప్రజలకు తెలపాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి సూచించారు. బుధ వారం బళ్ల గ్రామంలో బిఎల్ఎలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు వివరించి ప్రజల్లో సానుకూలత పెరిగేలా చూడాలన్నారు. అలాగే సర్ కార్యక్రమం త్వరగా వందశాతం నమోదయ్యేలా నేతలు చొరవ చూపాలన్నారు. అర్హులైన వారు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామరాజునాయక్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, కృష్ణప్ప, నాగభూషణం, రామూర్తి, జయశ ంకర్, మునిరెడ్డి, శంకరాచలం, గజేంద్ర, జేయి, లోకేష్ పాల్గొన్నారు

## మండల టీడీపీ అధ్యక్షుడిగా వాసు నాయుడు ప్రమాణ స్వీకారం

పాలసముద్రం, జులై 9 ప్రభాతవార్త



మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా వాసు నాయుడు నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడంతో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులుగా అంగరంగ వైభవంగా పార్టీ శ్రేణుల మధ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాసు నాయుడు మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వాసు నాయుడిని పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో పాలసముద్రం మండలంలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ కీలకం

### - జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి

చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:



స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ కీలకమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. చిత్తూరు డిఆర్‌డిఎ శిక్షణా కేంద్రంలో గురువారం యాదమరి మండల సమాఖ్య సభ్యులకు జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి మండల సమాఖ్య స్థానిక వనరులు, మార్కెటింగ్ అవకాశాలతో పాటు సభ్యుల నైపుణ్యాలను గుర్తించి ఆదాయంను పెంపొందించుకునే వ్యాపార ప్రణాళికను రూపొందించాలని సూచించారు. అలాగే ప్రతి వ్యాపార కార్యక్రమంను లాభదాయకంగా, స్థిరంగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే బ్యాంకుల అనుసంధానం, మార్కెటింగ్, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక నిర్వహణలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇక్కడ శిక్షణలో తెలుసుకున్న విషయాలను గ్రామ స్థాయిలోని స్వయం సహాయక సంఘాలకు చేరవేసి ప్రతి మహిళా సభ్యురాలు తన ఆదాయంను వృద్ధి చేసుకునే దిశగా ముందుకు సాగేందుకు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో పాటు యాదమరి మండల సమాఖ్య సభ్యులు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తిలోదకాలు

పెనుమూరు, జులై 9 ప్రభాతవార్త:

రాష్ట్రంలో అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం అమరావతి, పోలవరం అంటూ ప్రజా సంక్షేమంను పూర్తిగా తిలోదకాలు విడిచిందని మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కామసాని విజయ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం పేరిట కూటమి ప్రభుత్వం ప్రజాధనంను దుర్వినియోగం చేస్తూ ప్రజా సంక్షేమంను అటకెక్కించిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో పాటు రాష్ట్ర ఆదాయం ద్వారా వచ్చే నిధులను సైతం ఒక్క అమరావతి, పోలవరం నిర్మాణాలు అంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన ఈ రెండేళ్ళలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేసిందని, ఫలితంగా పేద ప్రజలు కష్టం లేకుండా జీవనం సాగించారన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో వున్న కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలకు ఎలాంటి లబ్ది కలుగకపోవడంతో వారు ప్రక్క రాష్ట్రాలకు వలస వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం నిధులను రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పేరిట నిధులు దుర్వినియోగం చేయకుండా ప్రజా సంక్షేమం పట్ల దృష్టి కేంద్రీకరించాలని ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఎబివిపి కీలకపాత్ర

### - చిత్తూరులో ఎబివిపి ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ

చిత్తూరుహెల్త్, జులై 9 ప్రభాతవార్త:




దేశ పునర్‌నిర్మాణంలో, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో అఖిల భారత విద్యార్థి పరిషత్(ఎబివిపి) కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర ఎబివిపి సంయుక్త కార్యదర్శి జి.అఖిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎబివిపి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని గురువారం చిత్తూరు నగరంలోని వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఎబివిపి ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం నుండి స్వామి వివేకానంద విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి జి.అఖిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజం, దేశం పట్ల బాధ్యత కలిగి వుండాలని, స్వామి వివేకానంద ఆశయాలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎబివిపి కన్వీనర్ సన్నా హర్షవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల సాధన కోసం ఎబివిపి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఈ ర్యాలీలో జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా, ఎబివిపి పూర్వపు కార్యకర్తలు దేవేంద్రనాయుడు, బాబు కిరణ్, షేక్ రెడ్డిమస్తాన్, పవన్‌యాదవ్, హేమచరణ్‌రెడ్డి, తేజ సూర్యరెడ్డి, దొరబాబు, నసీర్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## 'సర్'ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

బంగారుపాళ్యం, జులై 9 ప్రభాతవార్త:



మండల పరిధిలోని తంబుగానిపల్లి గ్రామంలో గురువారం ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ గ్రామంలో తనిఖీకి వచ్చిన సమయంలో బిఎల్ఓలు ఇంటింటికి వెళ్ళి ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంకు సంబంధించి ఓటర్ల నుండి ఎన్యుమరేషన్ ఫారాలు స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడికి వెళ్ళిన జెసి బిఎల్ఓలు 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేస్తున్న విధానంను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అర్హత వున్న ప్రతి ఓటరు వివరాలను ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో నమోదు అయ్యేలా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని బిఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 50లక్షలతో వీరప్పనాయని చెరువు అభివృద్ధి

కుప్పం, జులై 9 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలోని వెండుగ ంపల్లి పంచాయతీ వీరప్పనాయనపల్లి చెరువును యాభై లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. గురు వారం చెరువు అభివృద్ధి పనులను టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆయన మా ట్లాడుతూ యాభైలక్షల నిధులతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, సుందరీకరణ పనులు సైతం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్,డిఇ గణే నాయక్, కడ సభ్యుడు రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్లు శరవణ, పార్థసారథి,కో క్లస్టర్ వేడి, నేతలు సురేష్, అశోక్,మహేంద్ర, విభూషణ్, ఎపిఓ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం సిఎం చంద్రబాబు లక్ష్యం

రామకుప్పం, జులై 9 ప్రభాతవార్త



రైతుల సంక్షేమమే సిఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణనాయక్, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పల్లికుప్పంలో రైతులకు రాయితీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, యూనిట్ ఇన్‌చార్జ్ గంట్లప్పగౌడు, నేతలు చంద్రారెడ్డి, శ్రీనివాసులుగౌడు, గజేంద్ర, ఉమేష్, రమణ, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

10 -7 Pg9th cheli:10 -7 Pg9th cheli.qxd 7/9/2026 11:35 PM Page 1



# కాఫీతో చాక్లెట్ తోడు.. చురుకుపాలు సైదోడు !





కాఫీలో ఉండే కెఫీన్ ఏకాగ్రత, అప్రమత్తత పెంచడానికి పనిచేస్తుంది. డార్క్ చాక్లెట్‌లో ఫ్లేవనాల్స్, థియోబ్రోమిన్‌రక్తప్రసరణ, మూడ్‌పై సానుకూల ప్రభావం కలిగిస్తుంది. అవి రెండూ కలిపి సేవిస్తే చురుకుదనం మీ వశమౌతుంది. మీకెప్పుడైనా తల బరువెక్కినట్లో, కళ్లలో మందకొడితనం ఆవహించినట్లు ఉంటేనే ఏదో తెలిసిన మందులు వాడేయాలను అనుకోవద్దు. ఒక కప్పు కాఫీతో పాటు చిన్న ముక్క డార్క్ చాక్లెట్ తింటే చాలా ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. రుచితో పాటు దీని ప్రయోజనాల వెనక ఆసక్తికరమైన సైన్స్ కూడా ఉందని వివరిస్తున్నారు. కాఫీ, డార్క్ చాక్లెట్ రెండు ఉత్తజాన్ని చురుకుదనాన్ని పెంచేవని అందరికీ తెలిసిందే. కాఫీ నిద్రమత్తును తగ్గించి అప్రమత్తతను పెంచుతుంది. అందుకే పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు, చదువుకునే సమయంలో లేదా ప్రయాణాల్లో చాలా మంది కాఫీ తాగడం సహజం కదా.. కెఫీన్ నేరుగా నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి ఏకాగ్రతను పెంచేందుకు సాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెప్పేమాట. డార్క్ చాక్లెట్ కేవలం రుచికరమైన స్నాక్ మాత్రమే కాదు. ఇందులో ఫ్లేవనాల్స్, థియోబ్రోమిన్ అనే సహజ పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరచడంలో సాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మెదడుకు రక్త సరఫరా మెరుగుపడితే చురుకుదనం పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే డార్క్ చాక్లెట్ మూడ్‌ను ఉల్లాసంగా ఉంచడంలో కూడా తోడ్పడుతుంది. కాఫీ, డార్క్ చాక్లెట్ రెండింటిలోని పదార్థాలు కలిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు. కాఫీలోని కెఫీన్ తక్షణ ఉత్సాహాన్ని అందిస్తే, డార్క్ చాక్లెట్‌లోని థియోబ్రోమిన్ నెమ్మదిగా ప్రభావం చూపుతుంది. దీంతో ఒక్కసారిగా ఎనర్జీ పెరిగుతుంది. అప్పుడప్పుడు ఆస్వాదించదగిన చిట్కా. కాఫీ ఎక్కువగా తాగడం వల్ల కొందరిలో నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం, ఆందోళన వంటి సమస్యలు వస్తున్నాయనీ అంటుంటారు. ఏ ఆహారాన్నైనా మితంగా తీసుకోవడమే మంచి పద్ధతి. ఆహార సమతుల్యత పాటించవచ్చు.

## సమన్వయాన్ని పెంచే స్విస్ బాల్ !



బరువు తగ్గాలి.. ఆరోగ్యం మెరుగుపడాలి. ఇకనైనా వర్కవుట్లు చేద్దాం అని చాలాసార్లే అనుకుంటాం. కానీ అమలు చేయం. ఈ స్విస్ బాల్‌ని ఇంటికి తెచ్చుకుని చూడండి. బోలెడన్ని ప్రయోజనాలు. స్విస్‌బాల్‌తో పొట్ట, వీపు, పొత్తికడుపునకు ప్రయోజనం ఇచ్చే కసరత్తులు సులువుగా చేయొచ్చు. దీతో శరీరాన్ని బ్యాలెన్స్ చేయ గలరు. మెరుగైన పోశ్చర్ కూడా వస్తుంది. ఉదాహరణకు బాల్‌పై సిట్-అప్స్, ప్లాంక్స్ ప్రయత్నించి చూడండి. గర్భిణులు, వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేవారు, డెస్క్ ఉద్యోగులు.. ఈ స్విస్ బాల్‌పై వ్యాయామం చేయడం వల్ల వెన్ను కండరాలు బలపడతాయి. గర్భిణులకు ప్రసవ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయి. రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా ఉందా? అయితే,మీ శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారాలంటే స్విస్‌బాల్‌తో వ్యాయామాలు మొదలుపెట్టండి. ఒత్తిడీ అదుపులో ఉంటుంది. □

# పట్టుదలతోనే ఆకాంక్షల తీరు !



ఉద్యోగమనేది జీవితంలో ఒక భాగమేననుకొన్న ఓ భారతీయ విద్యాని పట్టు విడవకుండా చేసిన ప్రయత్నమే ఆమెకు ఓ ఉద్యోగానికి దారి చూపించింది. పట్టుదలతో శ్రమించి, ఈ కాలపు అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉద్యోగం సంపాదించిన ఒక భారతీయ యువతి కథ. యువతకు ఆదర్శంగా నలిచింది. న్యూయార్క్ యూనివర్సిటీ (ఎన్‌వైయూ) నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన దివ్య బన్సాల్. పట్టువదలని విక్రమార్కుడి వలె చేయని ఉద్యోగ ప్రయత్నంలేదు. ఎక్కని కంపెనీ గుమ్మం లేదు. ఎన్నో సార్లు తన దరఖాస్తు తిరస్కరించబడినా మళ్లీ మళ్లీ ప్రయ్నస్తూనే ఉంది. వీసా స్పాన్సర్‌షిప్ వంటి సమస్యలున్నా తొలి ప్రయత్నమే మనకు అనుకూలించకపోయినా ప్రయత్నం చూస్తూ ఉంటే ఉద్యోగం తప్పక వస్తుందని ఆమె తోటి విద్యార్థులకు చెబుతుంది. దివ్య ఉద్యోగం 420 కంపెనీలకు దరఖాస్తులు పంపింది. అయితే వందలాది దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, ఆమెకు కేవలం మూడే ఇంటర్వ్యూలకు పిలుపు వచ్చింది. తనవన్నీ విఫల ప్రయత్నాలని అనుకోలేదు. నిరాశ చెందకుండా పట్టుదలతో ప్రయత్నించి చివరికి రెండు ఉద్యోగ ఆఫర్లను సొంతం చేసుకుంది. రెండు చేతుల్లోనూ ఆఫర్లు పెట్టుకొని వాటిలో 'ది బెస్ట్' ఎంచుకోవడం ఆమె చేతుల్లోనే ఉంది. తాను న్యూయార్క్‌లో జీవితాన్ని నిర్మించుకోవడానికే వచ్చాననీ, కేవలం కెరీర్ కోసం ఉద్యోగంతో పాటు తనకు ఇష్టమైన నృత్యం జీమ్, ఇంట్లో వంటకాలు, ఆత్మీయులతో సమయం గడపడం వంటి వాటికి సమాన ప్రాధాన్యత ఇస్తానని తన జీవిత ఆకాంక్షలను చెబుతోంది.

# అన్నమయ్య

నారాయణ సూరి, లక్కమాంబ దంపతులకు వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో వైశాఖ పూర్ణిమినాడు కడపి జిల్లా తాళ్లపాకలో జన్మించాడు అన్నమయ్య. ఎనిమిదేళ్లకే ఎవరికీ చెప్పకుండా తిరుమలకు బయల్దేరాడు. ఆ యాత్రలో ఆకలిగొన్న అన్నమయ్యకు అలమేలు మంగమ్మ వృద్ధురాలిగా కనిపించి పాయసం అందించింది. తిరుమల చేరి స్వామిని దర్శించుకున్నాక.. అలమేలు మంగమ్మను కీర్తిస్తూ శ్రీ వేంకటేశ్వర శతకం రచించాడు. ఆ మహాక్షేత్రంలోనే ఉంటూ స్వామిని దర్శించుకుంటూ కాలం గడపసాగాడు. అన్నమయ్య ఆచూకీ తెలిసిన తల్లిదండ్రులు తిరుమల వెళ్లి అన్నమయ్యను తాళ్లపాకకు తెచ్చుకోగలిగారు. కానీ ఆయనలో స్వామి ధ్యాస తగ్గలేదు. భార్యవల్ల దారికి వస్తాడని వివాహం చేశారు. ఒకటి కాదు రెండు పెళ్లిళ్లు చేసుకున్నా.. శ్రీ వేంకటేశునిపై అపార భక్తి తగ్గలేదు. కనుకనే.. తిరుమల వెంకన్నను స్వామీ నీకు తిరుమల లడ్డూ కావాలా? అన్నమయ్య పాట కావాలా? అనడిగితే ఆ కోనేటిరాయడు రెండోదే కోరుకుంటాడు. ఆయన పాట స్వామికి అంత ఇష్టం మరి. దక్షిణాదిన పదకవితాశైలి, భజన సంప్రదాయాలకు ఆద్యుడు అన్నమయ్య. తన జీవితకాలంలో వేలాది కీర్తనలు రచించాడు. వియజ నగర సామ్రాజ్య ప్రతినిధి అయిన సాళువ నరసింగ రాయలు..తనపై కూడా కీర్తనలు రచించమని కోరగా తిరస్కరించాడు అన్నమయ్య. శ్రీహరిని స్తుతించిన ఈ నోరు మానవమాత్రులను కీర్తించదు అన్నాడు. ఆ మాటలకు ఆగ్రహించిన నరసింగరాయలు అన్నమయ్యను చెరసాలలో బంధించాడు. స్వామి అనుగ్రహంతో రాజుకు జ్ఞానోదయమై అన్నమయ్యను విడుదల చేయడమే కాదు, క్షమించమని ప్రాధేయపడ్డాడు. అన్నమయ్య సంకీర్తనల ప్రవాహం సెలయేరులా ప్రవహించింది. తిరుమల హుండీకి ఎదురుగా ఉన్న రాతి పలకల గదిలో సంకీర్తనల భాండాగారం బయటపడింది. అలా వేలాది అన్నమయ్య కీర్తనలు, మరెన్నో అమూల్య సంకీర్తనల సంపద అందుకోగలిగాం. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మ మొక్కటే.. కీర్తనలో సమాజంలోని అసమానతలను చీల్చి చెండాడాడు అన్నమయ్య నిండార రాజు నిదురించే నిద్రయు ఒక్కటే. అంటూ రాజు, బంటులకు తేడా ఏముందని ప్రశ్నించాడు. ఏనుగు మీద అయినా, శునకం మీద అయినా సూర్య కిరణాలు ఒకేరీతిలో పడతాయి అన్నాడు. పంచభూతాలకు లేని ఈ పట్టింపులు నీకెందుకు? అంటూ ఆనాడే చురక పెట్టాడాయన. అన్నమయ్య పరమ భక్తుడే కాదు గొప్ప సంఘసంస్కర్త ఆధ్యాత్మిక విప్లవ చైతన్యమూర్తి. □

## మీట నొక్కితే చాలు !



బియ్యం, పప్పులు లాంటివి ఎంత జాగ్రత్తగా పదిలపరచినా పురుగు చేరుతుంది. కొన్నిసార్లు బూజుపడుతుంది కూడా. అందుకు ముఖ్య కారణం. తడి చేత్తో కొలత డబ్బాను పట్టుకోవడం. చెయ్యి తుడుచుకున్నాం కదా అనుకుంటాం కానీ.. మిగిలి ఉన్న అతి కొద్ది చెమ్మ వల్ల కూడా పదార్థాలు పడైపోతాయి. మనకు అందుబాటులోకి వచ్చిన 'రొటేటింగ్ రైస్ డిస్పెన్సర్' అలాంటి ఇబ్బందులను తొలగిస్తుంది. ఇందులో కింది భాగంలోని పెద్ద అరలో బియ్యం, పైనున్న చిన్న అరల్లో కందిపప్పు, మినపప్పు, రవ్వ లాంటివి నిలువచేయవచ్చు. మీట తిప్పితే చాలు. కావాలనుకున్నది పంపులోంచి నీళ్లలా వచ్చేస్తుంది. చుట్టూ తిరిగే వీలు ఉండటానికి అవసరమైన అర ఎదురుగా వచ్చేట్లు తిప్పి, కావలసినంత పట్టుకుని మీట ఆపితే సరిపోతుంది. గాలి చొరబడక పోవడమే కాదు, వాటర్ ఫ్రైఫ్, డస్ట్ ప్రూఫ్ ఉండంతో పదార్థాలు తాజాగా ఉంటాయి. నాణ్యమైన ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో తయారయ్యింది కనుక ఆరోగ్య సమస్యలు రావు, పర్యావరణానికీ నష్టం లేదు. □

## మీ శ్రీమతికి శుభాకాంక్షలు చెప్పారా?



ఏమండోయ్! మీ శ్రీమతి పుట్టిన రోజు ఎపుడో గుర్తుందా! లేదా! అయితే ఇక అంతే అది కూడా గుర్తుంచుకోలేకపోతే మీరేం భర్త అండి. వెంటనే మీ 'మైండ్ బేక్'లో నోట్ చేసేసుకోండి. లేకుంటే ఇబ్బందే, ఆ తర్వాత మీ యిష్టం. పుట్టినరోజుకు భర్త ప్రేమతో ఇచ్చే చిరు కానుక కూడా ఎంతో సంతోషాన్నిస్తుంది కదా! ఏమీ ఇవ్వకున్నా ఆ రోజును గుర్తుంచు కుని శుభాకాంక్షలు చెప్పినా చాలనుకునే అల్ప సంతోషులం మనం. కానీ, మగవాళ్లు మాత్రం గుర్తులేదు. పనిలో పడి మర్చిపోయా.. అంటూ రకరకాల కారణాలు చెప్పేస్తుంటారు. మనమూ దాన్ని మర్చిపోయి.. సర్దుకుపోతుంటాం. అయితే, ఈ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోని దేశం ఒకటి ఉందని మీకు తెలుసా? ఇక్కడ భార్య పుట్టిన రోజును మర్చిపోతే ఇక వాళ్ల పని అంతే. 'సమోవా' అనే దేశంలో దీన్ని నేరంగా భావిస్తారట. అమెరికా సమీపంలో ఉండే పాలీనేసియన్ ఐల్యాండ్ దేశం ఇది. అందుకోసం ఇక్కడి ప్రభుత్వం ఏకంగా ఓ చట్టమే చేసింది. పైగా ఆ చట్టం సరిగా అమలవు తుందా? లేదా అనేది చూడడానికి ప్రత్యేకంగా పోలీసు బృందాలను కూడా ఏర్పాటు చేశారట. భార్య పుట్టిన రోజును మొదటిసారి మర్చిపోతే పోలీసులు భర్తకు వార్నింగ్ ఇచ్చి వదిలేస్తారట. అదే పొరపాటు రెండోసారి చేస్తే వాళ్లకు జరిమానా లేదా గరిష్ఠంగా ఐదేళ్లపాటు జైలు శిక్ష కూడా వేస్తారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు. అంతేకాదు, భార్యకు తన హక్కుల గురించి, ఈ చట్టం గురించి అవగాహన కల్పించ డానికి దేశమంతా క్యాంపులనూ నిర్వహిస్తారట. ఏదిఏమైనా ఇలాంటి చట్టం మన దేశంలో కనుక ఉండి జైళ్లన్నీ నిండిపోతాయేమో.

# 'దాదా ది సౌరవ్ గంగూలీ స్టోరీ' ఫస్ట్ లుక్ రిలీజ్



ప్రపంచ వ్యాప్తంగా మే 14, 2027న సినిమా భారీ విడుదల..లెజెండ్రీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ పుట్టిన రోజు సందర్భంగా దాదా ది సౌరవ్ గంగూలీ స్టోరీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. బాలీవుడ్ స్టార్ రాజ్‌కుమార్‌రావ్ టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు ఈ రోజు మరింత ప్రత్యేకంగా మారింది. ఇదే సమయంలో ఈ సినిమాను 2027, మే 14న లాంగ్ హాలిడే వీకెండ్ సందర్భంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అధికారికంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో 2002లో ఇంగ్లాండ్‌పై భారత్ సాధించిన చారిత్రాత్మక నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం తర్వాత లార్డ్స్ బాల్కనీలో సౌరవ్ గంగూలీ జెర్సీ ఊపిన ఐకానిక్ మూమెంట్ ను రాజ్‌కుమార్ రావ్‌తో సినిమాటిక్‌గా రీక్రియేట్ చేసినట్లు చూపించారు. దాదా ది సౌరవ్ గంగూల్డీ సినిమా క్రికెట్ ఆట ఆడిన వ్యక్తి మాత్రమే కాకుండా దానిని మార్చిన మనిషి అసాధారణ ప్రయాణాన్ని చూపిస్తుంది. ఒక ప్రతిభావంతుడైన యువ క్రికెటర్‌గా ప్రారంభమై భారతదేశంలో అత్యంత ప్రభావశీలమైన కెప్టెన్లలో ఒకరిగా ఎదిగిన గంగూలీ ప్రయాణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది.'దాదా ది సౌరవ్ గంగూలీ' సినిమాకు విక్రమాదిత్య మోత్వానె దర్శకత్వం వహిస్తున్నారు. లవ్ రంజన్, అంకూర్ గార్గ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీసిరీస్, డీబీఎల్ సమర్పణలో, లవ్ ఫిల్మ్స్ నిర్మాణంలో ఈ సినిమా రూపొం దుతోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2027, మే 14న థియేటర్లలో భారీ ఎత్తున విడుదల కానుంది.

## తెర

# 'వదలా': ట్రైలర్ లాంచ్



జగపతి బాబు, లయ, అకెళ్ల వి కృష్ణ, కిషోర్ నాయుడు చిరుమామిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్, చరిత చిత్ర ప్రొడక్షన్ వదలా మిస్టరీ గ్రిప్పింగ్ ట్రైలర్ లాంచ్‌వెర్సటైల్ యాక్టర్ జగపతి బాబు ఎమోషన్స్, మిస్టరీ, సస్పెన్స్ ఫ్యామిలీ థ్రిల్లర్ 'వదలా'తో సర్ప్రైజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. అకెళ్ల వి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించారు. చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమామిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించిన ఈ చిత్రం, ఆకట్టుకునే ఫస్ట్ గ్లింప్స్, మంచి ఆదరణ పొందిన టీజర్‌తో ఆసక్తిని పెంచింది. ఈ సినిమా జులై 17న థియేటర్లలోకి రానుంది. సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు తన విజువల్స్‌తో సస్పెన్స్ వాతావర ణాన్ని అద్భుతంగా చూపించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో జగపతిబాబు మాట్లా డుతూ..'వదలా' సినిమా జులై 17న వదులుతున్నాం. ఈ సినిమా కథ మీద నాకు చాలా నమ్మకం ఉంది. కచ్చితంగా ఆడు తుందని నమ్ముతు న్నాను. చాలా రోజుల తర్వాత నేను సోలోగా చేసి మొత్తం భారం తీసుకుని, ఇద్దరు హీరోయిన్స్‌తో ఒక ఫ్యామిలీ థ్రిల్లర్ చేస్తే నాకంటూ ఒక గుర్తింపు వస్తుందని చేసిన ప్రయత్నం ఇది. .నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు అయ్యింది. ఇన్నేళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో అంశాలను దృష్టిలో పెట్టుకుని సినిమా తీయాల్సి వస్తోంది. ఓటీటీ, హిందీ డబ్బింగ్... ఇలా చాలా విషయాలు చూడాల్సి వస్తోంది. ఎలా తీసినా ప్రేక్షకులను అలరించడమే అంతిమ లక్ష్యం. హీరోయిన్ లయ మాట్లాడుతూ.. "ట్రైలర్ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. అందరూ చాలా హార్డ్ వర్క్ చేసిన సినిమా ఇది. వదలా టైటిల్ చాలా క్యాచీగా ఉంది. జగపతిబాబుతో మళ్లీ కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది.

# 'మారెమ్మ' . అందరికీ నచ్చుతుంది: మిట్టపల్లి సురేందర్



'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, 'బావ బావ', మారి సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

**సినిమాలో వచ్చిన మొదటి అవకాశం గురించి?**

'ధైర్యం' సినిమాకు తొలిసారి పాట రాశాను. ఆ తర్వాత రాజన్నలో కాలిగజ్జె ఘల్లుమంటే, జార్జ్ రెడ్డిలో వాడు నడిపే బండి రాయల్ ఎన్‌ఫీల్డ్, లవ్ స్టోరీలో నీ చిత్రం చూసి, రాజు వెడ్స్ రాంబాయిలో రాసిన పాటలు నాకు మంచి పేరు తీసుకొచ్చాయి.

**మారెమ్మలో రాసిన 'మారి' పాట గురించి?**

'మారి' అనేది సినిమాలో హీరో ఆడుకునే దూడ పేరు. ఇలాంటి పాట రాసే అవకాశం రావడం నా అదృష్టం. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు క్లైమాక్స్‌కి వచ్చేసరికి ఆయనతో పాటు నేను కూడా ఏడ్చేశాను.

**ఈ మధ్యకాలంలో రాసిన పాటల గురించి?**

పెద్ది సినిమాలో రెండు పాటలు రాశాను. ఢిల్లీ ఎపిసోడ్‌లో వచ్చే అలసిపోవద్దురా పెద్ది, అలాగే పెద్ది ట్రైన్‌లో తిరిగి వస్తున్న ప్పుడు వచ్చే అనగనగా పాట, జగపతి బాబు ఎపిసోడ్‌లో వచ్చే ఆగిన శ్వాసలో ఆశయం ఉంది పాటలు రాశాను. అవన్నీ కథకు ఆయువు పట్టు లాంటి పాటలు. థియేటర్‌లో ప్రేక్షకులను ఎంతగానో కదిలించాయి.

**రవితేజని కలిశారా?**

ఈ సినిమా కోసం కాదు. చోర్ బజార్ సినిమాకు పాట రాసినప్పుడు ఆ సినిమాలోని పాటను రవితేజ లాంచ్ చేశారు. ఆ సందర్భంగా ఆయనను కలిశాను.

**మారెమ్మ రషెస్ చూశారా?**

నేను కథ మొత్తం చదివాను. కథ చదివినప్పుడు నేను ఎలాంటి ఎమోషన్ ఫీల్ అయ్యానో, అదే ఎమోషన్ స్క్రీన్‌పైకి వచ్చింది. దర్శకుడు చాలా అద్భుతంగా తీశారు.

**నిర్మాత గురించి?** మయూర్ తొలిసారి నిర్మాత అయినప్పటికీ ఎక్కడా రాజీపడకుండా సినిమా తీశారు.

**దర్శకుడు గురించి?**

దర్శకుడు చాలా టాలెంటెడ్. ప్రతి పాటను దగ్గరుండి రాయించారు. ఆయనకు ప్రతి విషయంలో మంచి ఇన్‌వాల్వ్‌మెంట్ ఉంటుంది.

**మీ స్ఫూర్తి ?** సినీ పరిశ్రమలో వేటూరి, చంద్రబోస్ నాకు స్ఫూర్తి.

**సంగీతం చేయాలనే ఆలోచన ఉందా?**

లేదు. రెండు పడవల ప్రయాణం చేయను. ప్రస్తుతం సినిమా పాటలు రాయడానికే పూర్తి సమయాన్ని కేటాయించాను.

**ఇప్పుడు రాస్తున్న సినిమాల గురించి?**

ప్రస్తుతం దాదాపు పది సినిమాలకు పాటలు రాస్తున్నాను. ఇడుపుకాయితం, జిల్లేడు చెట్టు, దేత్తడి, డేవిడ్ రెడ్డి ఇలా పలు సినిమాలకు రాస్తున్నాను.



## ఏ 'టాక్సిక్' మ్యూజిక్ వీడియో 'తబాహీ' రిలీజ్

మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్, జీ మ్యూజిక్ కంపెనీ కలిసి 'టాక్సిక్' ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్ సినిమాలోని తొలి పాట తబాహీ అఫీషియల్ మ్యూజిక్ వీడియోను విడుదల చేశాయి. రాకింగ్ స్టార్ యశ్, కియారా అద్వానీ జంటగా కనిపిస్తున్న ఈ పాటలో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రేమను అత్యంత స్వచ్ఛంగా, గాఢంగా చూపిం చిన ఈ పాట, అద్భుతమైన విజువల్స్, భావోద్వేగాలతో కూడిన కథనం, మ్యూజిక్ వీడియో విడుదలకు ముందు మేకర్స్ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన ప్రమోషన్ చేశారు. విశాల్ మిశ్రా స్వరపరచి, ఆలపిం చిన ఈ పాటకు హిందీలో రాజ్ శేఖర్ సాహిత్యం అందించారు. ఈ పాటను హిందీతో పాటు కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు, గాయకుడు విశాల్ మిశ్రా మాట్లాడుతూ, 'తబాహీ' సాధా రణ ప్రేమగీతం కాదు. ప్రేమ లోని త్యాగం, ఆవేశం, భావోద్వేగాలను ఈ పాట చూపి స్తుంది. యశ్, గీతూ మోహన్‌దాస్ కలిసి కథ అందించిన ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో చిత్రీకరించగా, తెలుగు, హిందీ, తమిళం, మలయాళంతో పాటు ఇతర భాషల్లో కూడా డబ్ చేసి విడుదల చేయనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో యశ్, నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు .ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' చిత్రం ఆగస్టు 26, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

## ఆగస్ట్ 14న 'అగధ' వస్తోంది



నిర్మాత గా ఒక చరిత్ర సృష్టించిన ఎం.ఎస్. రాజు , దర్శకునిగా అగధ చిత్రాన్ని ఒక విజువల్ వండర్ గా తీర్చిదిద్దారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ చిత్రం అగధ ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 14, 2026న భారీ స్థాయిలో విడుదల కానుంది.ఆ మధ్య విడుదలైన అగధ టీజర్ ఒక సెన్సేషన్ సృష్టించింది. ప్రేక్షకులు ఈ సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూసేలా చేసింది. టీజర్ లోని విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మిస్టీరియస్ వాతావరణం, గ్రాండియర్ మేకింగ్‌కు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభించాయి.అగధ గురించి దర్శకుడు ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ, 'అగధ' నా డ్రీమ్ ప్రాజెక్ట్. టీజర్‌లో చూసింది ఈ సినిమా ప్రపంచంలో ఒక చిన్న భాగం మాత్రమే. సినిమాలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఎన్నో అంశాలు ఉన్నాయి. ఇది ప్రతి ఫ్రేమ్ లోనూ ఓ విజువల్ వండర్‌లా అనిపించే సినిమా. అలాగే ఎమోషన్స్ కి టాప్ ప్రయారిటీ ఇచ్చాం. ప్రతి ఆర్టిస్ట్, ప్రతి టెక్నీషియన్ అద్భుతంగా పనిచేశారు. ముఖ్యంగా కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ తమ పాత్రల్లో అసాధారణ నటన కనబరిచారు. ప్రేక్షకులు థియేటర్లలో ఒక కొత్త అనుభూతిని పొందుతారు. నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు మాట్లాడుతూ, "అగధను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో నిర్మించాం. టీజర్‌కు వచ్చిన స్పందన మా ఆనందాన్ని మరింత పెంచింది. ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని విశ్వసిస్తున్నాం" అన్నారు.నటి కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ, "మహాదేవి పాత్ర నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్ర. ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు. హీరో శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ, 'డర్టీ హరి' తర్వాత మళ్లీ ఎం.ఎస్. రాజు గారితో పని చేయడం సంతోషంగా ఉంది. 'అగధ'లో నా పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి" అన్నారు.

# 'మిస్టర్ మిడిల్ క్లాస్'17న రిలీజ్



శ్రీకాంత్, లయ హీరో హీరోయిన్స్‌గా నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందు తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ మిస్టర్ మిడిల్ క్లాస్. జీకే సిఎన్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. జూలై 17న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ లో శ్రీకాంత్ వేంకటేశ్వర స్వామీ గెటప్‌లో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. మిస్టర్ మిడిల్ క్లాస్ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ .అందరూ కలసి ఎంజాయ్ చేసే ఫ్యామిలీ ఎంటం టైనర్. ఈ చిత్రంలో సునీల్, రఘుబాబు, అలీ, వెన్నెల కిశోర్, పృథ్వీ, బాబూ మోహన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి సాయి కార్తీక్ మ్యూజిక్, 'గరుడవేగ' అంజి సినిమాటోగ్రాఫర్, డైమండ్ రత్నబాబు డైలాగ్స్ అందిస్తున్నారు.

# నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ఘన విజయం





తిరుపతి విద్య, జూలై 9 ప్రభాత వార్త

జాతీయ స్థాయిలో నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయాల 9వ తరగతి ప్రవేశ పరీక్షల ద్వితీయ జాబితా ఫలితాల్లో విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు ఘన విజయం సాధించారు. తాజా ఫలితాల్లో పి. నితీష్ రెడ్డి, ఎస్. లేకిత శ్రీ నవోదయ విద్యాలయాలకు ఎంపికయ్యారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6వ, 9వ,11వ తరగతి నవోదయ ప్రవేశ పరీక్షల ఫలితాలన్నింటినీ కలిపి విశ్వం సంస్థల నుండి మొత్తం 71 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్. విశ్వనాథ రెడ్డి తెలిపారు.ఎంపికైన వారిలో కే. గీతిక, సి. కార్తీక్ శ్రీహాన్ రెడ్డి, పి. నిశాంత్, సి. హేమతేజ, హెచ్. అనన్య, ఎం. భావదీష్, ఆర్. నికోలస్ ఫ్రాంక్లిన్, కే. సిద్ధార్థ, బి. సాయి అభిరామ్, బి. హనీశ్రీ, ఎస్.ఎం. ఇలియాస్, కే. సాయి కృష్ణ, లిఖిత, జోషిక, శ్రావ్య, రిచిత, ప్రవీణ్, గగన్ హర్ష, గణేశ్, హర్షిత, తనుష, కావ్య, అస్మా, వరుణ్ సందేశ్, చరితార్థ, ప్రీతం, తేజస్వి, శ్రీదేవి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా విజేతలను విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్. విశ్వనాథ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ యన్. విశ్వ చందన్ రెడ్డి, కరస్పాండెంట్ యన్. తులసీ విశ్వనాథ్ అభినందిస్తూ, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు.డాక్టర్ యన్. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ, గత 36 సంవత్సరాలుగా సైనిక్ స్కూల్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ, ప్రతి ఏటా అత్యుత్తమ ఫలితాలు సాధించడం విశ్వం సంస్థల ప్రత్యేకత అని పేర్కొన్నారు. అలాగే 2027 విద్యా సంవత్సరానికి నవోదయ ప్రవేశ పరీక్షల దరఖాస్తులు ప్రారంభమయ్యాయని, ఆసక్తి గలవారు మరిన్ని వివరాల కోసం 8688888802 లేదా 9399976999 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# తిరుపతి డివిజన్

## సెయింట్ ఆంథోనీ చర్చిలో బిషప్స్ ఆర్డినేషన్ కార్యక్రమం

తిరుపతి విద్య, జూలై 9 ప్రభాతవార్త




ఆల్ ఇండియా క్రిస్టియన్ చర్చస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చెన్నై వ్యాసర్పాడిలోని సెయింట్ ఆంథోనీ చర్చిలో బిషప్స్ మరియు రెవరెండ్ ఆర్డినేషన్ కార్యక్రమం డాక్టర్ బిషప్ మోహన్ దాస్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ చర్చస్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ, ఆల్ ఇండియా క్రిస్టియన్ చర్చస్ కౌన్సిల్ దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగానూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బైబిల్ గ్రంథంలోని యోబు 39వ అధ్యాయాన్ని ఉటంకిస్తూ కొత్తగా ఆర్డినేషన్ తీసుకున్న రెవరెండ్లు, బిషప్‌లు యుద్ధరంగంలోని గుర్రం వలె దేనికీ భయపడకుండా,ధైర్యంతో దైవసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అనంతరం, నూతనంగా ఆర్డినేట్ చేయబడిన వారందరికీ మ్యారేజ్ లైసెన్స్, హ్యూమన్ రైట్స్ మెంబర్‌షిప్, ఐడీ కార్డులతో పాటు అంగుళీకములను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, గుజరాత్, జార్ఖండ్ రాష్ట్రాల ప్రతినిధులు, బిషప్‌లు పాల్గొన్నారు. ప్రముఖులలో బిషప్ టైటస్ సమాధానం, బిషప్ పాల్ జ్ఞానం, బిషప్ జ్ఞాన శేఖర్, మైనారిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ.జి. రత్నం, బిషప్ జి. సుందర రాజు, డాక్టర్ కింగ్స్ లీ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య



తిరుపతి,జులై 9ప్రభాతవార్త:

తిరుపతిలోని హరే రామ హరే కృష్ణ ఆలయ సమీపంలో ఉన్న సి టైప్ మునిరత్నం (37) ఆత్మహత్య చేసుకున్నాడు. రొంపిచర్ల మండలం బలిజవీదికి చెందిన రోహిణి, అదే మండలంలోని గాజులపల్లికి చెందిన మునిరత్నంతో వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. మృతుడు భార్య రోహిణి స్విమ్స్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తోంది.మునిరత్నం హరే రామ హరే కృష్ణ దేవాలయం సమీపంలో టిఫిన్ అంగడి పెట్టుకుని జీవనంసాగిస్తున్నాడు. ఆత్మహత్య చేసుకోవడంతో మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు.

## టిటిడి ఉద్యోగుల బ్యాంకు నూతన అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



తిరుపతి,జులై 9ప్రభాతవార్త:

తిరుపతిలోని టిటిడి ఉద్యోగుల బ్యాంకు నూతన అధ్యక్షుడిగా గంగా రాజ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆధ్వర్యంలో ఉద్యోగుల ఐక్యతకు మరింత కృషి జరుగుతుందని తెలిపారు. బ్యాంక్ నూతన అధ్యక్షుడికి టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ ,టిడిపి నాయకులు పులిగోరు మురళీకృష్ణ ,తాతయ్యగుంట గంగమ్మ ఛైర్మన్ మహేష్ యాదవ్ కలిసి దుశ్శాలువతో సత్కరించారు. టిటిడి ఉద్యోగులు భగవంతుడి సేవతో పాటు భక్తులు సేవ చేయడం పునర్జన్మ సుకృతమన్నారు. నూతన పాలకవర్గం వైస్ ప్రెసిడెంట్ హేమసుధ,కోశాధికారి దొరైరాజ్‌కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మాజీ అధ్యక్షుడు తలారి మహేష్ ,నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ శైలేంద్ర ,వాసు, రామచంద్ర ,కళ్యాణ కట్ట అసోసియేషన్ నాయకుడు చిన్న పాల్గొన్నారు.

## డ్రగ్స్ మహమ్మారి బారిన పడవద్దు




రేణిగుంట జూలై 9 ప్రభాతవార్త

యువకులు డ్రగ్స్‌కు అలవాటై జీవితాలను నాశనం చేసుకోవద్దని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు రూరల్ సీఐ మంజునాథరెడ్డి సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు నేతృత్వాన డ్రగ్స్ పై దండయాత్ర 2.0 లో భాగంగా బయో చెక్ టెస్టింగ్ కిట్ లతో గంజాయి వినియోగదారులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ ను గురువారం రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధి నందు ఎర్రమ రెడ్డిపాలెం వద్ద నిర్వహించారు. గంజాయి సేవించే వారిని గుర్తించడానికి సాంకేతిక పరమైన పరీక్షలు ప్రత్యేక కిట్ల ద్వారా నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గంజాయి సేవించిన వ్యక్తులను గుర్తించి గంజాయి సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేయడమే కాకుండా వాటి మూలాలను తెలుసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువకుల తల్లితండ్రుల అనుమతితో కౌన్సిలింగ్ ఇచ్చి వారిని పాపా నాయుడు పేట రాస్ పునరావాస కేంద్రం, స్విమ్స్, రుయా ఆసుపత్రి తదితర డి అడిక్షన్ కేంద్రాల ద్వారా చికిత్స కల్పిస్తామన్నారు.

కార్యక్రమంలో గాజులమండ్యం ఎస్సై హరీష సిబ్బంది పాల్గొన్నారు...

## ఆంగ్ల విభాగం పరిశోధకురాలికి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి,జులై 9ప్రభాతవార్త:



పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం పరిశోధక విద్యార్థిని షేక్ తమన్నాకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య పి. హరిపద్మ రాణి పర్యవేక్షణలో జెండర్ సెన్సిటైజేషన్ ఇన్ ఇండియన్ పిక్చర్ ఫిక్షన్–యాన్ ఎక్స్‌ప్లోరేటరీ స్టడీఖ (భారతీయ చిత్ర కథలలో లింగ సున్నితత్వం: ఒక అన్వేషణాత్మక అధ్యయనం) అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె. అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు సహచర విద్యార్థులు, ఆచార్యులు అభినందనలు తెలిపారు.

## సర్ పై ప్రజలకు అవగాహన ముఖ్యం

-క్లస్టర్2 వార్డుల్లో విస్తృత పర్యటన




తిరుపతి,జులై 9ప్రభాతవార్త:

తిరుపతి నియోజకవర్గం ప్రజలకు ఎస్ఐఆర్‌పై నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేలా ప్రతి బీఎల్‌ఏ ముందుండాలని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ,నియోజకవర్గం ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ సూచించారు. తిరుపతి నగరంలోని క్లస్టర్2 పరిధిలోని 5, 6, 7, 8, 9 వార్డుల్లో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను టిడిపి నాయకులు పులిగోరు మురళీకృష్ణ ,మహేష్ యాదవ్‌తో కలిసి పరిశీలించారు. సర్ అనేది ఓటర్లు తమ గుర్తింపు కోసం ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమమని,ఆధార్ కార్డు జిరాక్స్, ఫోటో ఇవ్వడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవనేది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఓటర్ కు ఎన్యూమరేషన్ ఫారాలు చేరేలా కృషి చేయాలని, ఇప్పటికే ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను వివరాలతో నింపి అందించేలా ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మహిళా అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ , క్లస్టర్ ఇన్చార్జులు జాహ్నవి ,జగదీష్,రాజేష్ ,వార్డుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ ప్రభంజనం

92.77 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థుల ఘన విజయం



తిరుపతి విద్య జూలై 9 ప్రభాత వార్త

దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎంఏ ఫౌండేషన్ పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన ప్రముఖ ఎమరాల్డ్స్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి తమ విజయ పరంపరను చాటుకున్నారు. ఈ పరీక్షల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు ఏకంగా 92.77 శాతం అద్భుత ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించినట్లు సంస్థ డైరెక్టర్లు ఇ. గిరిధర్, కె. విశ్వనాథ్ గురువారం సంయుక్తంగా వెల్లడించారు.వెలువడిన ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులతో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. వీరిలో జి. డి. దేవర్ష్ రాయల్ 346 మార్కులతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, పి. సాయి పృధ్వి 322 మార్కులు, పి. కోమల్ పటేల్ 312 మార్కులు, ఇ. చరితా 308 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విద్యాసంస్థ కీర్తిని దశదిశలా చాటారు.ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు మాట్లాడుతూ.. కఠినమైన జాతీయ స్థాయి వృత్తి విద్యా కోర్సు పరీక్షల్లో విద్యార్థులు ఇంతటి భారీ మార్కులు సాధించడం తమ సంస్థ అందిస్తున్న నాణ్యమైన శిక్షణకు, ప్రణాళికాబద్ధమైన విద్యా విధానానికి నిదర్శనమని కొనియాడారు. ఈ అద్భుత ఫలితాలు సాధించి సంస్థకు ముఖచిత్రంగా నిలిచిన టాపర్లను, విజేతలైన విద్యార్థులందరినీ, వారికి నిరంతరం మార్గదర్శకత్వం వహించిన అధ్యాపక బృందాన్ని యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేసింది.

## పుస్తక పఠనం మేధాశక్తిని పెంచుతుంది...

రేణిగుంట జూలై 9 ప్రభాతవార్త



పుస్తకాలను చదవడం వల్ల పఠనా శక్తితో పాటు మేధస్సును పెంచుతుందని రెయి న్బో విద్యాసంస్థ అధినేత అత్త ఉల్లా ఖాన్ అన్నారు. రేణిగుంట పట్టణంలోని ఖాన్స్ రెయిన్బో ఈ స్మార్ట్ స్కూల్ నందు గురు వారం బుక్స్ ఎక్స్పో జరిగింది. ఆర్య ఎడ్టెక్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ఈ ప్రదర్శన నందు వివిధ అంశాలకు సంబం ధించిన పుస్తకాలను విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచారు. ప్రత్యక్షంగా సందర్శించలేని ప్రాంతాలకు పుస్తకాలు చదవడం వల్ల చేరుకోవచ్చని ఖాన్ అన్నారు. ప్రతి పుస్తకం ఒక విజ్ఞాన భాండాగారమని తెలిపారు. పుస్తకాలను చదివి మేధస్సును పదును పెట్టడమే కాకుండా విజ్ఞానవంతులు కావాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా దేశవ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థులు పాల్గొని సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయస్థాయి పరీక్షల్లో (ఎస్ ఓ ఎఫ్) ఖాన్ రెయిన్బో ఈ స్మార్ట్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి జోనల్ స్థాయిలో ర్యాంకులు పథకాలు రివార్డులు కైవం చేసుకున్నారు నాలుగో తరగతి విద్యార్థి బి.నైనేశ్వర్ జోనల్ స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించి ఐదువేల నగదు గోల్డ్ మెడల్ దక్కించుకున్నాడు. మూడో తరగతి విద్యార్థి పిశక్తిశరవణ జోనల్లో ప్రథమ ర్యాంకు గోల్డ్ మెడల్ వెయ్యి రూపాయల రివార్డు కైవసం చేసుకున్నాడు. ఐదవ తరగతి విద్యార్థి మోక్షి త్, నాలుగవ తరగతి విద్యార్థి గోర్నేష్, మూడవ తరగతి విద్యార్థి వి నిహాల్, జోనల్ ఎక్సెంట్ మెరిట్ ధ్రువీకరణ పత్రాలు సాధించారు. హబీజా, మోక్షి త్, గిరీష్, నిహాల్ లు 500 రూపాయల రివార్డు అందుకున్నారు. వీరిని పాఠశాల ఛైర్మన్ అతావుల్లా ఖాన్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

## జేబీ శ్రీనివాసులును కలిసిన ఎస్వీయూ టెక్నికల్ టైమ్ స్కేల్ సభ్యులు

తిరుపతి విద్య, జూలై 9 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ నూతన ఇన్‌చార్జ్‌గా నియమితులైన జేబీ శ్రీనివాసులును ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజ్ టెక్నికల్ టైమ్ స్కేల్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గురువారం ఆయన నివాసంలో కలిసిన సభ్యులు.. జేబీ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా శాలువాతో సత్కరించి నూతన పదవీ బాధ్యతలకు గానూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన నాయకత్వం ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాబోయే రోజుల్లో తిరుపతి నగర అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షి ంచారు. తమను కలిసి అభినందనలు తెలిపిన ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రతినిధులకు జేబీ శ్రీనివాసులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.నాయకుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో సురేష్ బాబు, సోమశేఖర్, దామోదర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, శాంతారామ్,సుబ్రహ్మణ్యం, అనిల్ కుమార్, టీవీ చలపతి తదితర టెక్నికల్ టైమ్ స్కేల్ సభ్యులు పాల్గొన్నారు.

## పథకాలు అన్నివర్గాలకు అందేలా పనిచేయాలి

-బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి గవ్వల అశోక్




తిరుపతి, జులై 9 ప్రభాతవార్త:

ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామంలోని చిట్టచివరి వర్గాలకు అందే విధంగా ప్రభుత్వ అధికారులతో సమన్వయ పరుచుకుంటూ పనిచేయాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి గవ్వల అశోక్ అన్నారు. దళితుల హక్కుల కోసం, పారిశ్రామిక రంగంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దళితులను ప్రోత్సహించేందుకు దృఢ నిచ్చయంతో పని చేయాలని కోరారు.బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గా నియమితులైన గవ్వల అశోక్ ను ఆ పార్టీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్ అధ్యర్యంలో గురువారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, ,లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కాసరం మారుతీ కుమార్, నాగరాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదవాలి....

రేణిగుంట జూలై 9 ప్రభాతవార్త



విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్ పిలుపునిచ్చారు. రేణిగుంట మండలం ఆర్ మల్లవరం మండల ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత చదువులు అభ్యసించిన ఉపాధ్యాయుల ద్వారా విద్యా బోధన జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు కావలసిన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసిందన్నారు. ఇటీవల రోడ్డు వెడల్పులో భాగంగా కోల్పోయిన పాఠశాల భవన నిర్మాణానికి గ్రామస్తులు స్థలాన్ని సమకూర్చడం అభినందనీయమన్నారు. గ్రామస్తులు సమకూర్చిన స్థలం నందు సమగ్ర శిక్ష మంజూరు చేసిన 15 లక్షల విధులతో అన్ని సౌకర్యాలు సమకూరే విధంగా నూతన నూతన భవన నిర్మాణం జరిగిందన్నారు. గ్రామస్తులంతా ఏకమై బడిలో చదివే విద్యార్థుల శాతం తగ్గకుండా తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రంగనాథ్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భరత కుమార్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, డి.ఈ.కుప్పుస్వామి, ఏ.ఈ.చంద్రశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బాబుస్వామి, ఉపాధ్యాయిని శ్యామల, తదితరులు పాల్గొన్నారు..

## పీఎం శ్రీ పాఠశాల లక్ష్యాల సాధనలో రాజీ పడొద్దు

డీఈఓ కె.వి.ఎన్. కుమార్

తిరుపతి విద్య జూలై 9 ప్రభాత వార్త




జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుచానూరులో పీఎం శ్రీ పథకం కింద అందుబాటులోకి తెచ్చిన వివిధ రకాల మౌలిక వసతులు, విద్యా కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న సుమారు 20 రకాల పీఎం శ్రీ అభివృద్ధి అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా సైన్స్ , కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్ కోసం ఏర్పాటు చేసిన పాల్ ల్యాబ్, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కొరకు కేటాయించిన సిక్ రూమ్, కిచెన్ గార్డెన్, సోలార్ పవర్ వ్యవస్థ, సీసీ కెమెరాల నిఘా, ప్లే ఫీల్డ్ , స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ కె.వి.ఎన్. కుమార్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. వారి అభ్యసన సామర్థ్యాలను, పాఠ్యాంశాలపై వారికున్న పట్టును స్వయంగా పరీక్షి ంచి, విద్యార్థులు కనబరిచిన ప్రతిభపై ప్రత్యేకంగా సంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం శ్రీ పాఠశాలల యొక్క ఉన్నత ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలల్లో కేవలం నాణ్యమైన విద్యనందించడమే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే సహపాఠ్య కార్యకలాపాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డా. వల్లేరు చంద్రశేఖర నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# యస్వీయూలో నానో జాతా అవగాహన కార్యక్రమం



తిరుపతి విద్య, జూలై 9 ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మ్యాటర్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో బెంగళూరు ఇండియా నానో 2026 అవగాహన కార్యక్రమం (నానో జాతా) యస్వీయూ సెనేట్ హాల్‌లో ఘనంగా జరిగింది. డిగ్రీ విద్యార్థులకు నానో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాధాన్యత, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా దీనిని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ఆచార్య టాటా నరసింహారావు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనను, పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అతిథులుగా పాల్గొన్న రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఈ వినూత్న ప్రయత్నాన్ని ప్రశంసించారు.సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్తలు ఆచార్య జి.యు. కులకర్ణి (బెంగళూరు), ఆచార్య బి.ఎల్.వి. ప్రసాద్ (పుణే) కీలక ఉపన్యాసాలు చేశారు. వ్యవసాయం, వైద్యం, ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష పరిశోధన రంగాలలో నానో టెక్నాలజీ యొక్క ప్రాముఖ్యతను వారు వివరించారు. కార్యక్రమ సమన్వయకర్త, యస్వీయూ ఆర్ అండ్ డి డీన్ ఆచార్య జి. నరసింహ మాట్లాడుతూ, ఇటువంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో బంగారు నానో కణాలు, పైజోఎలక్ట్రిక్ పేవ్‌మెంట్, పండ్లరసం ద్వారా విద్యుత్ ఉత్పత్తి, సోడియంఅయాన్ బ్యాటరీలు వంటి పలు ఆధునిక ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సదస్సులో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. థింక్ నానో – ఇన్నోవేట్ నానో – ట్రాన్స్‌ఫార్మ్ నాన అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# శ్రీకాళహస్తి డివిజన్

## ముక్కంటి సేవలో టిడ్కో చైర్మన్



శ్రీకాళహస్తి, జులై 9 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ క్రమశిక్షణ వర్గాల కమిటీ అధ్యక్షులు వేములపాటి అజయ్ కుమార్ గురువారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చారు. దేవస్థాన చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్ స్వాగతం పలికి, స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అజయ్ కుమార్ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన బోర్డు సభ్యులు పగడాల మురళి, కొప్పెర్ల నాగరాజు, దేవస్థాన సిబ్బంది జనసేన పార్టీ నాయకులు జయప్రకాష్, ఢిల్లీబాబు, పర్వతాల హరికృష్ణ, లీలాధర్, రఘులు ఉన్నారు.

## సోలార్‌పై అవగాహన కల్పించేందుకు కృషి



తొట్టంబేడు, జూలై 9 ప్రభాతవార్త : రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఎల్విన్ ఎనర్జీ సంస్థ రూపొందించిన నూతన సోలార్ అవగాహన బ్రోచర్‌ను వైఎస్ఆర్‌సిపి నాయకుడు కలవగుంట భరత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సూర్య ఘర్ - ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా సామాన్య ప్రజలు సబ్సిడీతో సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా మరింత మందికి ప్రయోజనం చేకూరేలా సేవలు అందిస్తామని వెల్లడించారు.

## వైకాపా మండల నాయకుడు మృతి



శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు గ్రామానికి చెందిన గాండ్ల శివకుమార్ ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి వార్త స్థానికంగా విషాదం నింపింది. శివకుమార్ అందరితో కలివిడిగా ఉండేవారని, గ్రామ అభివృద్ధికి ఎప్పుడూ ముందుండేవారని స్థానికులు తెలిపారు. గురువారం శివ కుమార్ పార్థీవదేహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శివకుమార్ మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కిశోర్‌రెడ్డి, రమణయ్య యాదవ్, బత్తి శెట్టి, శివ, నాగార్జున రెడ్డి, రాజేంద్ర, నవీన్, నరేష్ తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం!

### -తొట్టంబేడు-నాయుడుపేట హైవేపై ప్రమాదం

తొట్టంబేడు, జూలై 9 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం, పొయ్యకొత్తూరు గ్రామానికి చెందిన వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. తొట్టంబేడు నాయుడుపేట హైవేపై బుధవారం జరిగిన ఈ ఘటన గ్రామంలో విషాదం నింపింది. తొట్టంబేడు ఎస్సై బి. బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి కనకంబాకం కృష్ణమాచారి వయసు (82 )సంవత్సరాలు. ఆయన కుమారుడు శివయ్య అచారి తొట్టంబేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ప్రకారం బుధవారం ఉదయం కృష్ణమాచారి నాయుడుపేటలోని తన కుమార్తె ఇంటి వద్ద కొయ్యపని ఉందని చెప్పి ఇంటి నుండి బయలుదేరారు. నాయుడుపేట వైపు నుండి వస్తున్న అశోక్ లేయలాండ్ కంపెనీకి చెందిన లగేజ్ వెహికల్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఏపీ 39 వీసీ 5380 డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా రోడ్డు దాటుతున్న కృష్ణమాచారిని బలంగా ఢీకొట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే శివయ్య అచారి, బంధువులు, గ్రామస్తులు సంఘటన స్థలానికి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## సర్‌లో పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలి

బుచ్చినాయుడు కండ్రిగ, జూలై 9 ప్రభాతవార్త: సర్ ప్రక్రియలో ఇంటింటి సర్వే నిర్వహించి ఎటువంటి పొరపాటు లేకుండా జాగ్రత్తగా సర్ కార్యక్రమమును పూర్తిచేయాలని సిబ్బందికి పిఎల్‌వోలకు ఎంపీడీవో వెంకటరత్నమ్మ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లపల్లి సచివాలయమును సందర్శించి బి ఎల్ వో లు, సచివాలయం సిబ్బందితో సమావేశమై సర్ ప్రక్రియపై చర్చించారు. సర్ సర్వేలో ఎటువంటి పొరపాట్లు అవకతవకులకు చోటు లేకుండా కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏదైనా ఇబ్బందులు చోటు చేసుకున్నప్పుడు గ్రామంలో సమావేశం సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యాల సిబ్బంది, బి ఎల్ వోలు పాల్గొనడం జరిగింది

## రూ.10 వేల ఆర్థిక సాయం



బుచ్చినాయుడు కండ్రిగ, జూలై 9 ప్రభాతవార్త: బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని పట్టాభిగిరి కాలనికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోట్లపాటి కన్నెయ్య ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆలత్తూరు గ్రామపంచాయతీ నాయకుల తరఫున మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం దహన సంస్కారాల నిర్వహణకు సహాయార్థం పదివేలు నగదు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, మండల ఐటీడీపీ విజయ్, గ్రామ కమిటీ అధ్యక్షులు సురేష్, జనరల్ సెక్రటరీ చంద్రమోళి రెడ్డి, జగన్నాథం, అంకయ్య, గురునాథం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సామాగ్రి పంపిణీ

బుచ్చినాయుడు కండ్రిగ జూలై 9 ప్రభాతవార్త: ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోడల్ ప్రైమరీ స్కూల్, పల్లమాల విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు తదితర సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు డైనింగ్ హాల్ నిర్మాణానికి సహకారం అందించిన వై.మోహన్, శ్రీమతి వై పద్మజ ని,ఎస్ ఫౌండేషన్ చైర్మన్ హేమ కుమార్ని పాఠశాల తరపున సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ రవీంద్రనాథ్, ఎంఈఓ 2ముని సుబ్రహ్మణ్యం హాజరై దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి ఆర్. పద్మావతి, కె.వెంకటేశ్వరావు, ఎస్.విజయభారతి, టి.అనూరాధ, ఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు కె.నారాయణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

### -కనిపించని విద్యార్థుల అవస్థలు, మధ్యాహ్నం భోజన కష్టాలు



రైల్వే కోడూరు అర్బన్, జులై 9 ప్రభాతవార్త : రైల్వే కోడూరు మండలంలోని రేషన్ షాపులు,పలు అంగన్వాడి సెంటర్లు, కొన్ని హాస్టల్లు తనిఖీ చేయడం జరిగింది. ఎక్కడ లేని విధంగా రైల్వేకోడూరులో చాలావరకు కచ్చితంగా అంగన్వాడీలు, రేషన్ షాపులు,హాస్టల్లు నడుపుతున్నారని చింత ప్రతాపరెడ్డి ఆయన తనిఖీల్లో భాగంగా తెలిపారు. అయితే వాస్తవం వేరే విధంగా ఉందని కోడూరు లోని హాస్టల్లో పరిస్థితి చాలా దారుణంగా ఉన్నాయని విద్యార్థులు తెలుపుతున్నారు. విద్యార్థులు తెలిపిన సమాచారం మేరకు పిల్లల దగ్గరే వంటలు చేయిస్తున్నారని, మధ్యాహ్నం భోజనం సరిపడా ఇవ్వట్లేదని,గుడ్లు కూడా అర కొరగానే పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అధికారులు వచ్చినప్పుడు విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉపదేశించిన విధంగా అన్ని సక్రమంగా ఉన్నాయని వాళ్ళు తెలుపుతున్నప్పటికీ చాలాచోట్ల హాస్టల్లో పరిస్థితి చాలా దయనీయంగా ఉందని విద్యార్థులు తెలిపారు. కోడూరు పట్టణంలోని బీసీ,ఎస్సీ హాస్టల్లో, అనంతరాజుపేటలోని స్కూల్లో మధ్యాహ్న భోజనం విషయంలో చాలా అవకతవకులు ఉన్నాయని విద్యార్థులు తెలుపుతున్నారు. మధ్యాహ్న భోజనం సరిగా లేక, పిల్లలకు సరిపడా గుడ్లు ఇవ్వక విద్యార్థులు ఎవరికి చెప్పుకోలేక చాలా బాధలు పడుతున్నారు. విద్యార్థుల హాజరు సంఖ్యకు వారు వడ్డిస్తున్న గుడ్ల సంఖ్యకు దాదాపు 70 తేడాగా ఉందని విద్యార్థులు తెలుపుతున్నారు. వంట కాంట్రాక్టర్కు మరియు స్కూలు హెడ్మాస్టర్ కు ఉన్న అనుకూల సంబంధాల వల్ల పిల్లలకి ఇచ్చే మధ్యాహ్న డొక్కా సీతమ్మ భోజన పథకం చాలా అవకతవకలకు గురవుతుందని తెలిపారు.

# తొట్టంబేడులో కరెంటు కష్టాలు...రైతులు ఆందోళన

### -చియ్యవరం సబ్ స్టేషన్ బ్రేక్ డౌన్‌తో పంటలకు నష్టం



తొట్టంబేడు, జులై 9 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలో రైతులు తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. చియ్యవరం సబ్ స్టేషన్ పరిధిలో నిరంతర బ్రేక్ డౌన్, తక్కువ వోల్టేజ్ సమస్యలతో రైతాంగం అల్లాడుతోంది. పంటలకు సకాలంలో నీరు అందించలేక వరి పొలాలు ఎండిపోయే ప్రమాదం నెలకొంది. మండల పరిధిలోని చియ్యవరం 33/11 సబ్ స్టేషన్ నుండి సరఫరా అయ్యే కాసరం ఫీడర్ను కొత్తగా అమర్చినప్పటి నుండి సమస్యలు మొదలయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చియ్యవరం సబ్‌స్టేషన్ ఫీడర్ సపరేటుగా ఉందని, కాసరం ఫీడర్ కు గొట్టిపూడి, రాంబొట్లపల్లికి సంబంధించిన ఫీడర్లని, చియ్యవరం సంబంధం లేదని అయితే విద్యుత్ అధికారులు పలుమార్లు విన్నవించిన పట్టించు కోలేదన్నారు. దీంతో విద్యుత్ సమస్య తీవ్ర రూపం దాల్చిందన్నారు. గడిచిన కొద్ది రోజులుగా విద్యుత్ ఏఈకి పలుమార్లు విన్నవించిన అదిగో ఇదిగో అని కాలయాపన చేశారని అయితే బుధవారం రోజు వ్యవసాయానికి కరెంటు సరఫరా అందలేదని ఉదయం 3గంటలకు రావాల్సిన కరెంటు కూడా సరఫరా అందకపోవటంతో రైతులు విద్యుత్ అధికారులను సంప్రదిస్తే బ్రేక్ డౌన్ అయిందని ఎంఆర్‌డిఓలు వచ్చి బిగించాలని ఉచిత సలహా ఇచ్చారన్నారు. కరెంటు లేకపోవడంతో పొలాలకు నీరు పెట్టలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే రైతులందరూ కలిసి విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. ఇప్పటికే పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థి దశలో అవగాహన అవసరం

### -శ్రీకాళహస్తి ఎంవి ఇన్సెపెక్టర్



శ్రీకాళహస్తి,జులై 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని వాహన తనిఖీ అధికారి కార్యాలయంలో శ్రీ చైతన్య విద్యార్థులకు అవగాహన సదస్సు ను ఎంవి ఇన్సె పెక్టర్ దామోదర్‌నాయుడు ఏర్పాటు చేసారు. గురువారం ఆయన విద్యార్థుల్లో అవగాహన కల్పించుటకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. వాహన శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను గురించి వివరించారు.రోడ్డు భద్రతపై విద్యార్థుల దశలో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తిలోని విద్యాలయాల్లో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలన్నారు. గురువారం 130 మంది విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. చిన్నారులు సైకిళ్ళపై అలాగే మోటార్లపై వెళ్ళునపుడు ట్రాఫిక్ రూల్స్‌ను తెలుసుకోవాలన్నారు. ఇక వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్నెస్ సర్టిఫికేట్లు జారి చేయటం అలాగే లైసెన్సుకు సంబంధించి లర్నింగ్ లైసెన్సు కొరకు డ్రైవింగ్ టెస్ట్ జరపటం జరుగుతుందన్నారు. విద్యార్థులకు కార్యాలయం నందుగల డ్రైవింగ్ ట్రాక్ గురించి వివరించారు. హెల్మెట్ ధరించుటకు సంబంధించి వివరిస్తూ ప్రాణ భద్రత కోసం తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని అలాగే తల్లిదండ్రులు ఽకూడా హెల్మెట్‌ను ధరించాలన్నారు.18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడపరాదన్నారు.

## సర్...సకాలంలో పూర్తి కావాలి : కమిషనర్



శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పురపాలకసంఘంలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో జరగాలని మున్సిపల్ కమిషనర్ ఎంవి కృష్ణారెడ్డి సూచించారు. గురువారం ఆయన శ్రీరామ్‌నగర్ కాలనీ, సచివాలయాలను ఆకస్మికంగా తనీఖి చేసారు.ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాలను చేపడుతున్న దరఖాస్తుల స్వీకరణ నమోదు, ధృవీకరణ ప్రక్రియలను పరిశీలించారు. ఈ కార్యక్రమాలు నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలన్నారు.

## నేడు ఐసర్ 7వ స్నాతకోత్సవం

శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి సమీపంలో ఏర్పాటు చేసిన కేంద్ర విద్యాసంస్థ ఐసర్ 7వ స్నాతకోత్సవం శుక్రవారం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు గురువారం ఓ పత్రికా ప్రకటనలో తెలిసారు. సుమారు 7 సంవత్సరాల క్రితం తిరుపతి కేంద్రంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యూకేషన్ అండ్ రిసెర్చ్ సంస్థను ఏర్పాటు చేసారు. ఎన్నో విజయాలను సాధిస్తున్న ఐసర్‌కు 7 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 10గంటలకు ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా నేషనల్ సెక్యూరిటి అడ్వైజరి బోర్డు సభ్యులు డిఆర్‌డిఓ మాజీ చైర్మెన్ ఏరోనాటికల్ సొసైటి అధ్యక్షులు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి హాజరౌతారని వివరించారు. ఐసర్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ హరీ ఎస్ భారటీయాల పర్యవేక్షణలో స్నాతకోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

## స్వామివారి ప్రసాదాలను నేలపాలు చేయొద్దు : తలపా



శ్రీకాళహస్తి జూలై 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానం వల్ల ప్రసాదాలు వృధాగా నేలపాలు అవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డికి కాంగ్రెస్ పార్టీ తరఫున వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ విధానం ద్వారా నిత్యం భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సాంకేతికత పేరుతో ప్రవేశపెట్టిన ఈ విధానం వల్ల నిరక్షరాస్యులు, మొబైల్ ఫోన్ లేనివారు ప్రసాదాలు పొందలేకపోతున్నారని తెలిపారు. ఆన్లైన్‌లో అమ్మకాలు జరగక ప్రసాదాలు వృధాగా నేలపాలు అవుతున్నాయని, దీనిని వెంటనే నివారించి పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరిముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగూరయ్యా, ముని కృష్ణయ్య, చందు, నాగరాజు, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఓలకు దిశానిర్దేశం చేసిన ఎంపీడీవో



తొట్టంబేడు, జూలై 9 ప్రభాతవార్త: తొట్టంబేడు మండల అభివృద్ధి అధికారి పి. సురేంద్రనాథ్ గురువారం మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ఎస్ఐఆర్ కార్యక్రమ పనులను పరిశీలించారు.ఎంపీడీవో పూడి, పొయ్య, గాబుచేయను, రౌతుసూరమాల గ్రామాలను సందర్శించి బూత్ లెవెల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ పనులు ఏ దశలో ఉన్నాయి, ఇంటి సర్వే ఎలా జరుగుతోంది, ఫారం6,7,8ల స్వీకరణ ప్రక్రియ సక్రమంగా సాగుతోందా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## రాయలసీమకు...టిడిపి ఇచ్చింది మాటలు కాదు: గురువారెడ్డి



ఏర్పేడు, జూలై 9 ప్రభాతవార్త: రాయలసీమ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ టిడిపి రాయలసీమకు ఇచ్చింది మాటలు కాదని అవకాశాలు అని అన్నారు. 2018లో టిడిపి ప్రభుత్వం కడప స్టీల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. నేడు 16,350 కోట్లతో జెఎస్డబ్ల్యు స్టీల్ ప్లాంట్ ప్రారంభమైంది. ఇది రాయలసీమ యువతకు వేలాది ఉద్యోగాలు ఇస్తుంది అని తెలిపారు. అనంతపురంలో కియా మోటార్స్ తీసుకువచ్చి వేలాది మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం కడప స్టీల్ ప్లాంట్ పేరుతో రెండుసార్లు శంకుస్థాపన చేసి గనులను మాత్రమే దోచుకుందని ఆరోపించారు. రాయలసీమ అభివృద్ధి కంటే ఫ్యాక్షనిజాన్ని పెంచిందని విమర్శించారు.కూటమి ప్రభుత్వం నాయకత్వంలో రాయలసీమకు నిధులు, నీళ్లు, ఉద్యోగాలు ఇచ్చి అభివృద్ధి చేస్తామని గురువారెడ్డి హామీ ఇచ్చారు.

## ఏర్పేడు గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్



ఏర్పేడు, జూలై 9 ప్రభాతవార్త : ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి గురువారం ఏర్పేడు శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతి దేవి నిలయాలు. జ్ఞానాన్ని అందించే విజ్ఞాన భాండాగారాలు అని అన్నారు. అటువంటి గ్రంథాలయాలను పాఠకులు, విద్యార్థులు ఉపయోగించుకుని మంచి మేధావులుగా తీర్చిదిద్దబడా లన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నామని తెలిపారు. ఏర్పేడు గ్రంథాలయంలో 7800 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిని పాఠకులు, విద్యార్థులు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అయ్యేవారు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక గ్రంథాలయ అధికారి నుండి రీడర్స్ సంఖ్యను తెలుసుకున్నారు. గ్రంథాలయాలను ఆధునికంగా తీర్చిదిద్ది, విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామని చైర్మన్ స్పష్టం చేశారు.

## దిగివతడకరలో కోర్టు ఉద్యోగి ఆకస్మిక మృతి

తవణంపల్లి, జూలై 9 ప్రభాతవార్త : కోర్టు ఆదేశాల మేరకు గ్రామానికి వెళ్ళిన కోర్టు ఉద్యోగి మూర్ఛవ్యాధితో ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన మండలంలోని దిగువ తడకడ గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. కోర్టు ఆదేశాల మేరకు కోర్టు ఉద్యోగి చిత్తూరుకు చెందిన కే జనార్ధన్ (43) అనే వ్యక్తి మండలంలోని దిగువ తడకర గ్రామంలోని కోర్టు పని మీద సుమన్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లాడు. అక్కడ సుమన్ ఇంటి ముందు అకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం అరగొండ అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి డాక్టర్లు జనార్ధన్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని తర్వాత చేస్తున్నట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు .

## దిక్కులు చూస్తూ...
# దిగాలుగా అన్నదాత

### - గాలులు తప్ప కానరాని వాన జాడ.. .
### రుతుపవనాల ప్రభావం అంతంతే !!
### - వేరుసెనగకు అదునుదాటుతుందని రైతుల్లో ఆందోళన..
### ఎల్‌నినో ప్రభావంతో పడని వర్షాలు !!



కుప్పం, జూలై 9 ప్రభాతవార్త: రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నిరాశను మిగుల్చుతోంది. ఓ పక్క నైరుతి రుతుపవనాలు వచ్చినా వాటి ప్రభావం కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వర్షాల జాడ లేకుండా పోయింది. ఖరీఫ్ సీజనులో రైతులు సాగు చేసే వ్యవసాయ ఆధారిత పంట అయిన వేరుసెనగ సాగుకు రైతులు సిద్ధమైనా అందుకు తగిన రీతిలో వర్షాలు కురవలేదు. పడమటి మండలాల్లో రైతులు అధికంగా ఖరీఫ్ సీజన్‌లో వేరుసెనగ పంటను సాగు చేస్తారు. ఓ పక్క వేరుసెనగ విత్తనాలు విత్తిన రైతులు, మరో పక్క విత్తనాలు విత్తాల్సిన రైతులు కూడా వర్షం రాకకు ఎదురుచూస్తున్నారు. రైతన్నలు వర్షాలకోసం దిక్కులు చూస్తూ దిగాలుగా కన్పిస్తున్నారు. ప్రభుత్వం సకాలంలోనే రైతులకు రాయితీ వేరుసెనగ విత్తనాలు అందించినా వర్షాలు లేకపోవడంతో రైతులు ఏం చేయాలో తెలియక ఆందోళనలో ఉన్నారు.

**గాలులే తప్ప జాడలేని వాన :**

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఎండవేడిమి కొంత తగ్గింది. అయితే ఈ సమయంలోనే వర్షాలు సైతం సాధారణంగా కురవాల్సి ఉంది. ప్రస్తుతం వర్షం వచ్చే సూచనలు అంతంతమాత్రమే ఉన్నాయని వాతావరణ పరిశోధనకులు పేర్కొంటున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతుందని వారు చెబుతున్నారు. అందుకు తగిన రీతిలోనే గత జూన్ నెలనుంచి ఇప్పటివరకు చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు నమోదు కాలేదు. వేరుసెనగ పంట సాగుకు జూన్ 15నుంచి జూలై 30వతేది వరకు సమయం అదునుగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మరో ఇరవై రోజుల్లోగా వర్షాలు పడితే తప్ప వేరుసెనగ రైతులు విత్తనాలు విత్తే అవకాశం లేకుండా పోతోంది. వేరుసెనగతో పాటు రైతులకు ప్రభుత్వం ఉచితంగా సోయాబీన్, క ంది విత్తనాలను సైతం అందించింది. వీటిసాగు చేపట్టాలన్నా వర్షాలు కురిస్తే తప్ప సాగుచేసే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. పడమటి మండలాల్లో హంద్రీ- నీవా జలాలు చెరువుల్లో ఉన్న చోట సమీప ఆయకట్ట రైతులు పంటలసాగు చేసుకునే అవకాశం ఉంది. పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడ్డ రైతులకు మాత్రం ఖరీఫ్ సీజన్ ఏమేర ఆదుకుంటుందో వేచి చూడాలి.

# గోవిందమాల భక్తులకు తిరుమలలో తిరుపతిలో ఏర్పాట్లు చేయాలి

### - గోవింద దీక్ష వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ

తిరుపతి హెల్త్, జూలై 9 ప్రభాతవార్త: దేశ దేశాలనుండి గోవింద దీక్ష మాల ధారణ స్వీకరిస్తున్న భక్తుల సంక్షేమం,సమస్యల పట్ల టిటిడి ఉన్నతాధికారులు తిరుమలలో వసంత మండపం నందు,తిరుపతిలో కపిలతీర్థం నందు ముడుపు దారణ కోసం దీక్షాపరులకు అన్ని వసతులతో కూడిన విధంగా టీటీడీ అధికారులు దర్శనాలు అందించాలని గోవింద ప్రబోధ నంద అన్నారు.గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో భక్తాధులతో వారు మాట్లాడారు. గోవింద మాల భక్తులకు ఆన్లైన్లో టికెట్లు ఇవ్వడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని, కనీసం సక్రమంగా పదిమంది కూడా టోకెన్లు తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దీనివలన గోవింద మాల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. స్వామి భక్తితో పాదయాత్రతో తిరుమల దర్శనానికి వస్తున్న భక్తులు గదులు, దర్శనం లేక తిరుగు ప్రయాణం చేస్తున్నారని వారి మనోభావాలను గౌరవించి దర్శన ఏర్పాట్లు,వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజులలో గోవిందా మాల భక్తులకు దర్శనాలు ఏర్పాట్లు చేయాలని ఆ దిశగా టిటిడి బోర్డు సభ్యులు,చైర్మన్,ఈవో, జేఈవో,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి గోవింద మాల భక్తులకు సౌకర్యాలు కలిగే విధంగా చూడాలని గోవింద దీక్ష వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరారు.వి జగన్నాథం మాట్లాడుతూ గోవింద దీక్ష భక్తులు ప్రతి వైకుంఠ ఏకాదశి ద్వాదశి దర్శనము 49 రోజులు కఠినమైన దీక్ష నియమాలు పాటించి తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తుంటారని ఎన్నో




ఏళ్లుగా ఈ సాంప్రదాయం కొనసాగుతున్నదని గతంలో టీటీడీ దేవస్థానం వారు వసతులతో కూడిన దర్శనము కలగజేసే వారని, ఇప్పుడు నిబంధనల పేరుతో భక్తులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. గోవింద మాల భక్తులు సుమారు 70 టీములు ఉన్నాయని వారందరికీ తగు ఏర్పాట్లు చేయాలని గోవింద మాల భక్తుల తరపున టీటీడీ అధికారులను కోరారు. ఈ సమావేశంలో గోవింద మాలధార భక్తులు పాల్గొన్నారు.

# కాలువ భూమి ఆక్రమణపై ఆగ్రహం

## బాధితులకు న్యాయం చేయాలంటూ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన




**తిరుపతిరూరల్, జూలై 9 ప్రభాతవార్త:**

తిరుపతిరూరల్ కుంట్రపాకం గ్రామ పంచాయతీ పరిధిలోని అరుంధతివాడలో వున్న కాలువ పోరంబోకు భూమి ఆక్రమణపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తిరుపతిరూరల్ తహశీల్ధార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తుల తెలిపిన వివరాలు మేరకు 1992లో విహెచ్ఎస్ పట్టాల ద్వారా 67కుటుంబాలకు ఒక్కొక్కరికి 2.5 సెంట్ల చొప్పున కాలువపోరంబోకు భూమిని కేటాయించారన్నారు. ఆ భూమి 2023వరకు సుమారు 20అడుగుల లోతు వున్న కాలువను పూడ్చివేయడం జరిగిందన్నారు. కాలువ పూడ్చిన తర్వాత గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమకు కేటాయించిన పరిమితిని మించి సుమారు 40సెంట్ల కాలువను ఆక్రమిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ భూమిపై ఆరు అడుగుల ఎత్తులో ప్రహారీ గోడ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఈ భూమి దాదాపు పది కుటుంబాలకు సంబంధించినదైనా రాజకీయ పలుకుబడితో ఒక కుటుంబం ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాళ్ళు ఆరోపించారు. పలుమార్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లభించలేదన్నారు. ఈ విషయమై తహశీల్ధార్, ఆర్.ఐ, విఆర్వోలకు వినతిపత్రాలు సమర్పించిన చర్యలు తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమవద్ద వున్న విహెచ్ఎస్ పట్టాలు ద్వారా పొందిన పత్రాలు ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. ఈ సందర్భంగా స్థానికుడు భరత్‌కుమార్ మాట్లాడుతూ కూటమిప్రభుత్వంలో పేదలకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. కాలువ పోరంబోకు భూమికి హద్దులు గుర్తించి, ఆక్రమణను వెంటనే తొలగించాలని, బాధితులకు హక్కు భూమి ఇవ్వాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థులకు స్వీయ రక్షణపై అవగాహన

**చిట్వేలి, జూలై 9, ప్రభాతవార్త:**



విద్యార్థులు చట్టాల పట్ల అవగాహతో స్వీయ రక్షణ పొందవచ్చని స్థానిక ఎస్సై వినోద్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిధిలోని నాగవరం లోని విద్యానికేతన్ పాఠశాలలో సైబర్ నేరాలు,అల్లరిమూకల వేధింపులు, బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు గురించి పిల్లలకు వివరించారు. సాంకేతికతను విద్యసమాచారం కోసం మాత్రమే వాడాలని, దుర్వినియోగం చేయరాదన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోరాదని,ఇతరుల నుంచి వేధింపులకు గురైనప్పుడు ధైర్యంగా తల్లిదండ్రులకు తెలపాలని సూచించారు. ఆనందం కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ విలువైనదని,ఇప్పటి కష్టం మిగిలిన జీవితాన్ని సుఖమయం చేస్తుందని ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. అత్యవసర పరిస్థితులో 100/112 నెంబర్ కి మరియు సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 నెంబర్ కి ఫిర్యాదు చేయాలని ఎస్ఐ వినోద్ కుమార్ విద్యార్థులకు సూచించారు.పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

### ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి

**పెనగలూరు(జూలై 09) ప్రభాతవార్త**



మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పెనమలూరు మండలం ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లి ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల, స్కూల్ టైమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, పద్మాయగారి పల్లి దళితవాడ లో సైబర్ క్రైమ్, పోక్సో చట్టం పై, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే తీసుకునే చర్యలు పై, బాల్య వివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, గంజాయి కేసులలో దొరికితే వచ్చే ఇబ్బందులు, నష్టాల పై అవగాహన కల్పించారు. సింగనమల వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి అన్ని రకాల వాహన పత్రాలు, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహనాలకు ఇన్సూరెన్స్ చేపించు కోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రహరీ హద్దులను పరిశీలించిన ఎమ్మార్వో.

**చిట్వేలి, జూలై 9,ప్రభాతవార్త:**



స్థానిక మండల పరిధిలోని ఎం రాచపల్లి గ్రామస్తులు పాఠశాల ప్రహరీ హద్దులు నిర్ణయించాలని కోరిన నేపథ్యంలో గురువారం ఎమ్మార్వో ఎస్ వి నరసింహారావు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పిల్లల ఇబ్బందిని గమనించి, నిర్ణయించిన హద్దుల ప్రకారం తక్షణమే ప్రహరీని నిర్మించాలని ఎమ్మార్వో అధికారులకు సూచించారు. అర్జీ ఇచ్చిన వెంటనే స్పందించిన ఎమ్మార్వోకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రామ్మోహన్, మండల సర్వేయర్ త్యాగరాజు, వీఆర్వో ఉదయ్, గ్రామ సర్వేయర్ రామాంజనేయులు, పలువురు అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమం పూర్తిగా పారదర్శకం.

### అసత్య ప్రచారాలు నమ్మవద్దు ఎమ్మార్వో.

**చిట్వేలి, జూలై 9, ప్రభాతవార్త:**



ఓటర్ల జాబితాను కచ్చితంగా ఉంచేందుకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం పూర్తిగా పారదర్శకమని స్థానిక ఎమ్మార్వో ఎస్ వి నరసింహారావు అన్నారు. గురువారం స్థానికంగా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్వో మాట్లాడుతూ అర్హత కలిగిన ఏ ఓటరు పేరును కూడా యాదృచ్ఛికంగా తొలగించరని, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను పూర్తిగా అనుసరించిన తర్వాత మాత్రమే ఓటర్ల జాబితాలో మార్పులు లేదా సవరణలు చేపడతారని స్పష్టం చేశారు.అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడికి ఓటరుగా నమోదు అయ్యే హక్కు ఉందని, అవసరమైన వివరాలు సమర్పించిన ప్రతి అర్హుడికి ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. సర్ కార్యక్రమాలపై ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఈ కార్యక్రమం నిజమైన ఓటర్లకు ఇబ్బందులు కల్పించడం కోసం కాదని, ఎన్నికల వ్యవస్థను మరింత పటిష్టంగా, పారదర్శకంగా రూపొందించడమే దీని ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.మండలంలోని బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలను ధృవీకరిస్తూ, అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఓటరు పేరు జాబితాలో లేకపోయినా, వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నా, సంబంధిత దరఖాస్తులను బూత్ లెవల్ ఆఫీసర్ ద్వారా సమర్పించి నమోదు లేదా సవరణ చేసుకునే అవకాశం ఉందన్నారు.2002 మ్యాపింగ్ గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై స్పందిస్తూ, 2002 మ్యాపింగ్ పూర్తికాకపోతే ఓటు తొలగిపోతుందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. 2002 మ్యాపింగ్ అనేది కేవలం ఓటరు వివరాల ధృవీకరణ ప్రక్రియ మాత్రమేనని, అది ఎవరి ఓటు హక్కును స్వయంచాలకంగా రద్దు చేసే ప్రక్రియ కాదని తెలిపారు. 2002 మ్యాపింగ్ జరగకపోయినంత మాత్రాన ఎవరి పేరు కూడా వెంటనే ఓటర్ల జాబితా నుండి తొలగించబడదని వివరించారు.ప్రతి అర్హత కలిగిన ఓటరికి తన వివరాలను సమర్పించుకునే, అవసరమైన పత్రాలను అందించే పూర్తి అవకాశం కల్పించబడుతుందని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సమగ్ర విచారణ, ధృవీకరణ అనంతరమే ఏవైనా నిర్ణయాలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు మరియు ప్రజలందరూ ఎన్నికల అధికారులకు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్వో నరసింహారావు కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ మరియు సర్ కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డిని సన్మానించిన...



### మండల బిజెపి నాయకులు ముక్క రూపేష్ రెడ్డి తదితరులు...

**ఓబులవారిపల్లి, జూలై 9 ప్రభాతవార్త**

తిరుపతి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు ఓబులవారిపల్లి వడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు అభిమానులు ఓబులవారిపల్లి బిజెపి మండల అధ్యక్షుడు ముక్కా రూపేష్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా శాలువాకకి సన్మానించారు ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై బిజెపి పార్టీ బలోపటానికి కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో చంగల్ రాయుడు మరియు బిజెపి అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి వితరణ

**విజయపురం, జూలై 9 ప్రభాతవార్త:** విజయపురం మండలంలోని మహావీరపురం, పన్నూరు ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 59 మంది విద్యార్థులకు నగరికి చెందిన బాల మురుగన్ స్టోర్ యజమాని రాధాకృష్ణ ఆర్థిక సౌజన్యంతో నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని విశ్రాంతి ఉపాధ్యాయుడు చంద్రయ్య చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.వేణుప్రసాద్, దుర్గ, ఉపాధ్యాయులు టి.లోకనాథం, గ్రామ పెద్ద ఎస్.చంద్రయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన హేమంత్ మృతి

### వేలూరు సిఎంసిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస



**చంద్రగిరి, జూలై 9 ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి జారుకున్న హేమంత్ కుమార్ రెడ్డి (నాని) (22) గురువారం మృతి చెందాడు. స్థానిక అక్కగార్ల కాలనీకి చెందిన కె.ధనప్రకాష్‌రెడ్డి, కె.మునిలక్ష్మి దంపతుల కుమారుడు కె.హేమంత్ కుమార్ రెడ్డి మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. హేమంత్‌ను తిరుపతి రుయాకు, అక్కడి నుండి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు వేలూరు, రాణిపేట సిఎంసికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చంద్రగిరి నుండి పోలీసులు సిఎంసికి వెళ్ళి మృతదేహానికి అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి, ఆపై కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించనున్నారు.

**-ఎదిగిన బిడ్డ శాశ్వతంగా దూరం**

ఎదిగిన బిడ్డ శాశ్వతంగా దూరం కావడంతో తల్లిదండ్రులు కె.ధనప్రకాష్‌రెడ్డి, కె.మునిలక్ష్మి రోధనలు హృదయ విధాకరకరంగా వున్నాయి. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా హేమంత్ ఉద్యోగ ప్రయత్నంలో వుండగా రోడ్డు ప్రమాదంలో మరణించడం జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుడి చిన్నాన్న మదనమోహన్ రెడ్డికి హేమంత్ పట్ల అత్యంత ప్రేమాభిమానాలు, అనుబంధం కలిగి వుండటంతో హేమంత్ ఇకలేడనే విషయాన్ని తట్టుకోలేక కన్నీటి పర్యంతమవుతున్నాడు. అక్కగార్ల కాలనీలో నానిగా సుపరిచితమైన హేమంత్ మృతి కాలనీలో విషాధం నింపుతున్నది.

## ఏడాది పొడవునా సాగుతో అధిక దిగుబడులు

### ఏటిఎం ఎం.భార్గవి, రాస్ కెవికె శాస్త్రవేత్త అనిల్‌కుమార్



**చంద్రగిరి, జూలై 9 ప్రభాతవార్త:**

ఏడాది పొడవునా (365 రోజులు) వ్యవసాయ సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏటిఎం ఎం.భార్గవి, రాస్ కెవికె శాస్త్రవేత్త అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని శానంబట్లలో గురువారం వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు 365 రోజులు పంటల సాగు ద్వారా నేల, నీరు, సూక్ష్మజీవుల సంరక్షణ అనే అంశాలపై రెండు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది పొడవునా సాగు చేయడం వలన నేల సారవంతం పెరగడం, నేలలో తేమ నిల్వవుండటం, నీటి వినియోగం సామర్థ్యం మెరుగు పడటం, నేలలోని సూక్ష్మజీవుల సంఖ్య, క్రియాశీలత పెరిగి పంటల దిగుబడులు మెరుగుపడతాయన్నారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంపై ఎపిసిఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ శ్రీదేవి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆత్మ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగుదేశ కూటమి ప్రభుత్వం ప్రజల పక్షం

### ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి.

**రేణిగుంట జూలై 9 ప్రభాతవార్త**



ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజల పక్షమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. రేణిగుంట మండలం జీపాలెం పంచాయతీ పద్మా నగర్ నగర్ నందు తిరుమల తిరుపతి సుమో, టాక్సీ డ్రైవర్లకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గురువారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. 62 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరికి 1.5 సెంట్లు ఇంటి స్థలానికి సంబంధించి పట్టాలు అందుకున్నారు. పేదవారైన తమకు ఇంటి స్థలాలకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేసినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేను పొగడ్తలతో ముంచెత్తారు. గజమాలతో సత్కరించి మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి యువనేత నారా లోకేష్ నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట తాహసిల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో రవిచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు, వీఆర్వో నళిని, కార్యదర్శి సుబ్బారెడ్డి, రూరల్ సీఐ మంజునాథరెడ్డి, గాజులమండ్యం ఎస్సై హరీష, తదితర ప్రభుత్వ అధికారులతో పాటు తిరుపతి పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, మైనార్టీ నాయకుడు నవాబు, టిడిపి సీనియర్ నాయకులు కొరియర్ రవి, అడ్వకేట్ ఉదయ్ కుమార్ రెడ్డి, కన్నన్ రెడ్డి తదితర పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు..

# తిరుపతి డివిజన్

## తిరుపతిలో పుడ్ కమీషన్ చైర్మెన్‌ను కలిసిన రేషన్ డీలర్స్ సంఘం నేతలు



**తిరుపతిరూరల్,జూలై 9 ప్రభాతవార్త:**

తిరుపతి పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పుడ్ కమీషన్ చైర్మెన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డిని తిరుపతి రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పద్మావతి అతిధి గృహంలో ఆయన్ను కలిసి దశ్సాలవతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం తిరుపతి అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి, తిరుపతిరూరల్ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యధర్శి గుత్తా కోటేశ్వరనాయుడు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలు, ప్రజా పంపిణి వ్యవస్థ బలోపేతంపై చైర్మెన్‌తో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌరులకు నాణ్యమైన రేషన్ సేవలు అందించడంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తోందని వాళ్ళు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం జిల్లా కార్యధర్శి ఎన్.శ్రీనాధ్, ఉపాధ్యక్షుడు దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధేశ్వర స్వామి ఆలయ నూతన నిర్మాణానికి తీర్మానం

**వరదయ్యపాలెం, జూలై 9, ప్రభాతవార్త**



బస్టాండ్ వద్ద తరతరాలుగా భక్తుల పూజలు అందుకుంటున్న శ్రీ సిద్ధేశ్వర స్వామి (సిద్దులయ్య స్వామి) ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి నూతనంగా నిర్మించాలని గ్రామపెద్దలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆలయ చైర్మెన్, విశ్రాంత గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బొప్పన రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ తీర్మానం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఆలయం లేకపోవడంతో భక్తులు ఎండ, వానలకు ఇబ్బంది పడుతున్నారు. భక్తుల మనోభావాలను గుర్తించి గ్రామపెద్దల సహకారంతో నూతన ఆలయ నిర్మాణానికి బొప్పన రమేష్ చొరవ తీసుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బొప్పన చంద్రబాబు, చిన్ని, బీజేపీ మండల అధ్యక్షుడు దిలీప్ రాయల్, టీడీపీ మహిళా నాయకురాలు మునిభూషణమ్మ, గ్రామ పెద్దలు పృథ్వీ భవరాజు, లక్ష్మయ్య, కల్లూరు బాలసుందరం, దొడ్డి మునికృష్ణయ్య, కాట్ కుమార్, స్వామాట్, గుత్తి సురేష్, ఆలయ అర్చకులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎన్‌టీఆర్ కాంస్య విగ్రహం

**కేవీబీ పురం, జూలై 9 ప్రభాతవార్త:**



మాజీముఖ్యమంత్రి, దివంగత నేత స్వర్గీయ నందమూరి తాకర రామారావు విగ్రహం కేవీబీ పురంలో ఏర్పాటు చేశారు. కేవీబీ పురంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ప్రారంభోత్సవం రాష్ట్ర మంత్రి వర్గం చేత ప్రారంభిస్తే బాగుంటుందని మండల ప్రజలు కోరుతున్నారు. ఇందుకు గాను పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్యేలు చొరవ చూపాలని వారు కోరుతున్నారు. ఇన్ని సంవత్సరాలకు గాను విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని మండల ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యాహక్కు చట్ట సవరణకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టండి

### - ఉపాధ్యాయులకు టెట్‌ను రద్దు చేయండి



**విజయపురం, జూలై 9 ప్రభాతవార్త:**

విద్యా హక్కు చట్టం లోనే 23వ సెక్షన్ సబ్‌సెక్షన్ వన్ సవరించేలా పార్లమెంట్‌లో చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని తద్వారా ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు లభించేలా కృషి చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కి చిత్తూరు జిల్లా ఫ్యాఫ్టో శాఖ విజ్ఞప్తి చేసింది. గురువారం తిరుపతిలోని ఆయన నివాసం వద్ద చిత్తూరు జిల్లా ఫ్యాఫ్టో చైర్మన్ ఎన్.మణిగండన్ కలసిన సందర్భంగా 2010 ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చిన విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని కానీ, అంతకు ముందు ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన వారిని కూడా టీచరు ఎలిజిబిలిటీ టెస్ట్ పాస్ అవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో చట్టాన్ని ప్రోస్పెక్టివ్‌గా 2010 నుంచి అమలు చేసేలా చట్ట సవరణకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు ఒక వైపు బోధన బాధ్యతలు ఉండగా మరొక వైపు టెట్‌కు ప్రిపరేషన్ కష్ట సాధ్యంగా మారిందని, పైగా బోధించే సంబంధిత సబ్జెక్టులు కాకుండా ఇతర సబ్జెక్టుల్లో కూడా పరీక్ష రాయాల్సి రావడం ఇబ్బందికరంగా ఉందని, ఈ తరుణంలో విద్యాహక్కు చట్ట సవరణ సరైన పరిష్కారంగా భావించి ఆ దిశగా కృషి చేయాలని కోరారు. ఆయనతో జేఏసీ చైర్మన్ రాఘవులు, పలువురు ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## భక్తుల స్వహస్తాలతో శ్రీ షిరిడీ సాయిబాబాకు పాలాభిషేకం

**పుత్తూరు రూరల్, జూలై 9 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని టీబీ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 4.30 నుంచి ఈ పాలాభిషక్త్రం కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం బాబాకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం విద్యుత్ దీపాలంకరణతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ దృష్టికి... తొలగించిన గెస్ట్ జేఎల్‌ల ఫిర్యాదు



దొరవారిసత్రం, జూలై 9 ప్రభాతవార్త: డీవీ సత్రం బీసీ గురుకుల కళాశాలలో విధులు నిర్వహించే ఏడు మంది జూనియర్ లెక్చరర్స్‌ను సబ్జెక్ట్ వారిగా పర్సంటేజ్ రాలేదని, వారి ప్రవర్తనలు బాగాలేదని ఇటీవలన త్రీసభ్య కమిటీ, రాష్ట్ర బీసీ గురుకుల పాఠశాల డిప్యూటీ కార్యదర్శి మాధవయ్య, జిల్లా కన్వీనర్ ఉమామహేశ్వరి, ఏట అక్కారావు తో విచారణ జరిపి తొలగించారు. వీరందరూ రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసి న్యాయం చేయాల్సిందిగా కోరడంతో ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు, డాక్టర్ గౌతమ్‌రాజ్, మేకల విక్టలు క్షేత్ర స్థాయిలో గురువారం విచారణ జరిపారు. ఏడు మంది జేఎల్స్‌ను ఏ బేస్ మీద విధులు నుంచి తొలగించారు అని కమిషన్ సభ్యులు విచారణ జరిపిన రాష్ట్ర బీసీ గురుకుల డిప్యూటీ కార్యదర్శి మాధవయ్యను ప్రశ్నించగా పొంతలేని సమాధానాలు చెప్పడంతో పాటు సబ్జెక్ట్‌ల వారీగా 100 శాతం పర్సంటేజ్ రాలేదని ఒక్కసారి, జేఎల్స్ ప్రవర్తనాలు బాగాలేకపోవడం వలన తొలగించామని మరోసారి చెప్పడంతో పాటు స్థానిక ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే జేఎల్స్‌ను తొలగించడం జరిగిందన్నారు. దీంతో మండిపడిన కమిషన్ సభ్యులు గురుకుల కళాశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో కమిటీ సభ్యులు విచారణ జరపకుండా ఎస్సీలైన జేఎల్లను కక్ష ధోరణిలో కారణాలు చెప్పకుండా నానా ఇబ్బందులు పెట్టి తొలగించడం వలనే ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి, బీసీ సొసైటీకి చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు గురుకులం అధికారులు సరైన సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ప్రస్తుతం డీవీ సత్రం బీసీ గురుకులం, కళాశాలలో కొందరు టీచర్స్ వికృత చేష్టలు చేస్తున్నారు. దానికి చెందిన వీడియోలు అన్ని మా దగ్గర ఉన్నాయి. వీటి మీకిస్తే రాష్ట్ర బీసీ అధికారులు చర్యలు తీసుకుంటారని కమిషన్ సభ్యులు బీసీ అధికారులను నిలదీశారు. పర్సంటేజీ సాధించిన దళిత జూనియర్ లెక్చరర్స్‌ను సరైన కారణం లేకుండా తొలిగించారని కమిషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు వచ్చినప్పుడు అన్ని వైపులా విచారించి సరైన నిర్ణయం తీసుకునే ఉంటే ఈరోజు జేఎల్‌లకు అన్యాయం జరిగేది కాదన్నారు. కేవల రాష్ట్ర బీసీ గురుకుల అధికారులు ఎలాంటి ఆధారాలు సేకరించకుండానే ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని ఏడు మంది జేఎల్‌లను తొలిగించడం చాలా దారుణమన్నారు. పూర్వపు విద్యార్థులను సైతం విచారణ జరిపితే తొలిగించిన జేఎల్స్ తమకు బాగా బోధించి మంచి మార్కులు వచ్చేందుకు కృషి చేసినట్లు విద్యార్థులు తెలిపినట్లు సభ్యులు వివరించారు. ఏది ఏమైనా జేఎల్‌లకు తీరని అన్యాయం జరిగింది. కాబట్టి ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్ర, డీఎస్పీ చెంచుబాబు, కన్వీనర్ ఉమామహేశ్వరి, ప్రిన్సిపాల్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మట్టి, ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు : డీఎస్పీ



నాయుడుపేట, జూన్ 9 ప్రభాతవార్త : నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో అనధికారి అక్రమంగా గ్రావిల్, ఇసుక, మట్టి, వంటి తరలించే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట సబ్ డివిజన్ డీఎస్పీ చెంచు బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. గురువారం డీఎస్పీ చెంచు బాబు మాట్లాడుతూ సూళ్లూరుపేటలో గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వుతూ ఉండగా జెసిబి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని త్వరలో కూడా కొన్ని వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పరిశ్రమలకు, ఇళ్లకు, గవర్నమెంట్ వర్క్ కు సంబంధించిన కోసం ఏ ప్రాంతంలో అయినా మట్టి గ్రావిల్ ఇసుక తరలించాలి అంటే దానికి సంబంధించిన రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్,అధికారుల వద్ద నుండి పరిమిషన్ తీసుకొని తోలకాల జరపాలని తెలిపారు. అలా కాకుండా అక్రమంగా ఇసుక మట్టి గ్రావెల్ తరలిస్తే సంబంధిత ఎమ్మార్వో వీఆర్వో రిపోర్టును తీసుకొని కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా వాహనాలను సీజింగ్ చేసి వాహన యజమానులపై కేసును నమోదు చేస్తామని అన్నారు. అంతేకాకుండా ఇక్కడ నుండి బయట ప్రాంతాలకు తరలిస్తే, బయట ప్రాంతాల నుంచి రవాణా జరిగిన సరే, కేసులు చేస్తామని అక్రమ ఇసుక, మట్టి, గ్రావిల్, వాటిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నట్లు డి.ఎస్.పి చెంచు బాబు అన్నారు.

## శ్రీ ధర్మరాజు స్వామి ఉత్సవాల... గోడపత్రికల ఆవిష్కరణ

**-జూలై 17 నుండి 29 వరకు ఉత్సవాలు-అన్ని శాఖలు సమన్వయంతో పని చేయండి ఎంఎల్‌ఏ**



శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న ద్రౌపతీ సమేత శ్రీ ధర్మరాజు స్వామివారి దేవస్థాన వార్షిక ఉత్సవాల ఆహ్వాన పత్రికలు గోడ పోస్టర్లను గురువారం ఆలయ ప్రాంగణంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జూలై 17 నుంచి 29 వరకు 13 రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయని తెలిపారు. ఆలయంలో ప్రస్తుతం భారత పఠనం జరుగుతుందన్నారు. భారతాన్ని నేటి తరాలకు అందించుటకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వికృతమాలకు చెందిన రంగస్థల కళాకారులకు అవకాశం కల్పించినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, అధికారులు, ధర్మకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బ్యాంకుల వార్షిక జీవనోపాధి ప్రణాళికలను ఆవిష్కరణ

**రూ.35,907 కోట్ల వార్షిక రుణ లక్ష్యానికి ఆమోదం-జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, జూలై 9 ప్రభాతవార్త : జిల్లాలో వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ,విద్య, గృహనిర్మాణం, ఇతర ప్రాధాన్యతా రంగాల అభివృద్ధికి అవసరమైన రుణాల కల్పన ద్వారా సమగ్ర ఆర్థికాభివృద్ధిని సాధించాలనే లక్ష్యంతో రూపొందించిన తిరుపతి జిల్లా బ్యాంకుల వార్షిక జీవనోపాధి ప్రణాళిక 2026..27) బుక్ లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు అన్ని ప్రాధాన్యతా రంగాలకు తగిన స్థాయిలో రుణాలు అందించి రైతులు, యువ పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి పొందే లబ్ధిదారులు, విద్యార్థులు, గృహ నిర్మాణదారులకు చేయూత అందించాలని సూచించారు. జిల్లా ఆర్థికాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని పేర్కొంటూ, నిర్దేశించిన రుణ లక్ష్యాలను శాతం వందకు వంద అమలు చేసేందుకు అన్ని బ్యాంకులు కృషి చేయాలని కోరారు. 2026-27 వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం వ్యవసాయ రంగానికి రూ.19,431 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి రూ.6,789 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.717 కోట్లు కేటాయించారు. ఇందులో విద్యా రుణాలకు రూ.133 కోట్లు, గృహనిర్మాణ రుణాలకు రూ.309 కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. అదనంగా ప్రాధాన్యత లేని రంగాలకు రూ.8,971 కోట్లు రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ విధంగా మొత్తం రూ.35,907 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను జిల్లాలో అమలు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ గుంటూరు రవికుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలెక్టరేట్ శాఖ మేనేజర్ చంద్రప్రసాద్,మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో కొత్త ఎలక్ట్రిక్ సైకిల్ తయారీ కేంద్రం

**-ఎమోటార్డ్‌తో ప్రభుత్వం ఒప్పందం**



కుప్పం,జులై 9ప్రభాతవార్త: ఎలక్ట్రిక్ సైకిల్ బ్రాండ్ ఎమోటార్డ్ చిత్తూరు జిల్లా కుప్పంలో కొత్త తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు కుప్పం గ్రీన్ సిటీ ఇనిషియేటివ్లో భాగంగా చేపట్టుతోంది. ఈ ప్లాంట్ కోసం ఆ కంపెనీకి 7 ఎకరాల భూమిని కేటాయించారు. భారతీయులకు ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఎమోటార్డ్ లక్ష్యానికి ఇది మరో కీలక అడుగు. ఈ ప్రాజెక్టును కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ తో కలిసి అమలు చేస్తున్నారు. ఈ తయారీ కేంద్రం స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా కల్పించనుంది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు,సీఈఓ కునాల్ గుప్తా మాట్లాడుతూ: "కుప్పం మా ప్రయాణంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించిందని, ఈ ఏడాది ప్రారంభంలో ఇక్కడే ప్రత్యేకతఅని, ఆ అనుభవం మాకు ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. ఇది కేవలం తయారీ కేంద్రం మాత్రమే కాదని, స్థానిక ప్రజలకు ఉపాధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, భారతదేశ స్వచ్ఛమైన మొబిలిటీ భవిష్యత్తులో భాగస్వామ్యం కల్పించే ప్రయత్నమన్నారు. గ్రీన్ సిటీ ఇనిషియేటివ్‌కు దూరదృష్టితో సిఎం చంద్రబాబు నాయుడుకి అలాగే ఈ ప్రయాణంలో భాగస్వాములను చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సర్వీస్ రోడ్డు పక్కన మ్యాంగో ఫ్యాక్టరీ వ్యర్థాలు?

**- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు**



పూతలపట్టు, జూలై 9 ప్రభాతవార్త : పూతలపట్టు మండల పరిధిలోని కూల్ బీచ్ మ్యాంగో ఫ్యాక్టరీ సమీపంలో సర్వీస్ రోడ్డు పక్కన వ్యర్థ పదార్థాలు వదిలివేస్తున్నారనే ఆరోపణలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాల నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తోందని, దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు, సమీప ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు చెబుతున్నారు. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకుండా బహిరంగ ప్రదేశాల్లో వదిలివేస్తే పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రజారోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ఘటనపై పరిశీలన నిర్వహించి, పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలు పారవేస్తున్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా వ్యర్థాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించి, స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కూలేందుకు సిద్ధంగా వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్

**వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి**



నాగలాపురం, జూలై 9 ప్రభాతవార్త: నాగలాపురం మండలంలోని రాజులకండ్రిగ గ్రామ సచివాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర స్థితిలో ఉండడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఒక వైపు వంటి ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో ప్రజలు నిత్యం ఆ మార్గంలో సంచరిస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ప్రదేశం గ్రామంలోని ప్రధాన రహదారి కావడంతో పాదచారులు, ద్విచక్రవాహన దారులు, రైతులు, విద్యార్థులు తరచూ రాకపోకలు సాగిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరిగినా ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగేలోపే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయడం, కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# వామ్మో కంకర కూడా లూటీనా... రవాణాశాఖ ఏం చేస్తోంది!



సత్యవేడు, జూలై 9 ప్రభాతవార్త: సత్యవేడు మండలంలో చిన్న ఫిర్యాదుపై స్పందించిన రెవెన్యూశాఖ అధికారులకు పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమ కంకర తరలింపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా మండల పరిధిలోని చమర్తకండ్రిగ నుంచి ప్రతి రోజు వందలాది వాహనాల్లో కంకర తరలిస్తున్నారు. అధిక టన్నేజీలతో టిప్పర్ లారీల్లో కంకరను తమిళనాడుకు తరలిస్తున్నారు. ఎక్కువ టన్నేజీలో కంకర తరలించడం వల్ల రోడ్లు దెబ్బతినడంతో పాటు రోడ్ల చుట్టూ ఉన్న గ్రామాలకు తీవ్రమైన దుమ్ము, ధూళి తప్పడం లేదు. ఈ విషయంపై సత్యవేడు తహసీల్దార్ శివప్రసాద్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దాంతో వీఆర్వో మునిరాజా గురువారం వరుసగా మితిమీరిన వేగంతో దూసుకు వస్తున్న కంకర టిప్పర్ లారీలను ఆపడం జరిగింది. అందులోని రికార్డులను పరిశీలిస్తే టిప్పర్ లారీలో అధిక లోడుతో కంకర తరలిస్తున్నట్టు గుర్తించారు. వరుసగా వచ్చిన ఆరు లారీల్లోను రికార్డుల్లో నిర్ణయించిన వాటికంటే అధికంగా కంకర తరలిపోతున్నట్లు గుర్తించారు. దాంతో వీఆర్వో ఆరు లారీలను తిరిగి క్వారీలకే పంపించడం జరిగింది. ఒక వీఆర్వో తనిఖీ చేస్తేనే ఆరు లారీల్లోను అధిక టన్నేజీతో కంకర దోపిడీ జరుగుతున్న విషయం వెలుగు చూసింది.

**మామూళ్ళ మత్తులో...**

నెలసరి మామూళ్లు రవాణా శాఖకు అందుతోంది. ఇందు కోసం ఓ దళారిని ఏర్పాటు చేసుకున్నారు. ఆయన గారు ప్రతి టిప్పర్ లారీకి ఆర్టీవో పేరుతో డబ్బులు వసూలు చేసి నెలనెలా ఇటు పోలీసు శాఖకు, అటు రవాణా శాఖకు చేరవేస్తున్నారు. ఈ కారణంగానే పై శాఖల అధికారులు కంకర లారీల వైపు వారి చూపు ఉండదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# తిరుపతి అభివృద్ధి బాధ్యత టీటీడీదే

**- తిరుమల-తిరుపతి అభివృద్ధి ట్రస్ట్ ఏర్పాటు చేయాలి**
**- ట్రస్ట్‌కు నా తొలి విరాళం రూ.10 లక్షలు**
**- కుప్పాల గిరిధర్ కుమార్ వెల్లడి**



తిరుపతి హెల్త్, జూలై 9 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పేరులో తిరుపతి ఉన్నప్పటికీ, నగర అభివృద్ధికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ అన్నారు. తిరుపతి అభివృద్ధి బాధ్యతను టీటీడీ స్వీకరించి, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నగరాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. దేశ విదేశాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వస్తారని, వారికి తొలి స్వాగతం పలికే నగరంగా తిరుపతిని మరింత అందంగా, ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత టీటీడీతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశంలోని మహానగరాల అభివృద్ధికి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ స్కీమ్ కింద రూ.4.00 లక్షల కోట్లు కేటాయించగా, ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖపట్నం, విజయవాడ మాత్రమే ఎంపికయ్యాయని గుర్తుచేశారు. జనాభా ప్రాతిపదికన తిరుపతికి అవకాశం రాకపోయినా, నగర ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం టీటీడీ ఆధ్వర్యంలో 12 రకాల ట్రస్టులు అమల్లో ఉన్నాయని, వాటితో పాటు 13వ ట్రస్ట్‌గా తిరుమల-తిరుపతి అభివృద్ధి ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ట్రస్ట్‌కు తనవంతు తొలి విరాళంగా రూ.10 లక్షలు అందజేస్తానని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి అభివృద్ధి ట్రస్ట్ ఏర్పాటు లో ప్రత్యేక చొరవ తీసుకుని పి4లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ నిధులతో టీటీడీ మరియు మున్సిపల్ కార్పొరేషన్‌లతో సమన్వయం చేసుకుంటూ తిరుపతిను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా అభివృద్ధి చేయాలని కోరారు. టీటీడీ దేశవ్యాప్తంగా సనాతన ధర్మ ప్రచారం కోసం అనేక ఆలయాల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో, శ్రీవారు కొలువుదీరిన తిరుపతి నగర అభివృద్ధిని కూడా అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకోవాలని కోరారు. తిరుపతి సమగ్ర అభివృద్ధి ద్వారా శ్రీవారి క్షేత్ర ప్రతిష్ఠ మరింత ఇనుమడిస్తుందని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కుప్పాల గిరిధర్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఎల్‌నినో పరిస్థితుల్లో...పీఎండిఎస్ అత్యంత అవసరం



చిట్టమూరు, జూలై 9 ప్రభాతవార్త : దేశ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఎడగారు రైతులందరూ పీఎండిఎస్ విత్తనాలు కచ్చితంగా తమ పొలాల్లో చల్లుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మహా విపత్తును ఎదుర్కొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా అనేక విస్తృత కార్యక్రమాలు, అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. చిట్టమూరు మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో పీఎండిఎస్ విత్తనాలు నిల్వ ఉన్నాయన్నారు. ఎల్ ని నో ప్రభావం వల్ల అధిక ఉష్ణోగ్రతల నమోదుతో పాటు తక్కువ వర్షపాతం,వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకోవడం, వేడి గాలులు సైతం సాయంత్రం వరకు కూడా వీస్తుండడం దీని తీవ్రతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చునన్నారు. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో భూమి తల్లి వేడిని తట్టుకోవాలంటే 30 రకాలు కలగలిపిన పిఎండిఎస్ విత్తనాల గుళికలను రైతులందరూ ఉపయోగించుకోవడమే శ్రేయస్కరమన్నారు. ప్రస్తుత ఎండాకాలంలోనూ ఈ విత్తనాలు చల్లుకోవడం ద్వారా వర్షాలు కురిసినప్పుడు మొలకెత్తే పరిస్థితులు ఉన్నాయని, తద్వారా నేల పంట వేసే వరకు కప్పి ఉంచడం ద్వారా అధిక ఉష్ణోగ్రతలను తట్టుకుని సాగుకు అనుకూలంగా మారుతుందని తెలియజేశారు. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో జడ్పీఎన్ఎఫ్ స్టాఫ్ ద్వారా పోస్టర్లు పంపిణీ చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. గురువారం అరవపాలెం ఆర్ఎస్కె పరిధిలో ఎఫ్ఎమ్టి బాబాసాహెబ్ ఐసిఆర్పి కన్నా శ్రీనివాసులు పోస్టర్ల ప్రదర్శించి రైతులుకు అవగాహన కల్పించారు.

## షార్‌లో సర్ ప్రక్రియ 80 శాతం పూర్తి



సూళ్లూరుపేట, జూలై 9 ప్రభాతవార్త: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో సర్ ప్రక్రియ 80 శాతం పూర్తి అయినట్లు మండల తహశీల్ధార్ శైలకుమారి గురువారం తెలిపారు. సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్రరెడ్డి శ్రీహరికోటలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరు శాతం సర్ ప్రక్రియను పూర్తి చేయల నిసూచించారు. షార్‌లోని 259,260, 261 పోలింగ్ బూత్ లకు సంబధించి పూర్తి భాద్యతతో పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, బిఎల్ఓల పాల్గొన్నారు.

## మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా...విజయ భాస్కర్



నాయుడుపేట, జూలై 9 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి. విజయభాస్కర్ నియామకం 1999లో పార్టీ కార్యకర్తగా చేరి 2002లో ఎస్సీ మోర్చా నెల్లూరు నగర ప్రధాన కార్యదర్శిగా అలాగే ఎస్సీ మోర్చాలో వివిధ స్థాయిలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాష్ట్ర కార్యదర్శిగా, ఉమ్మడి నెల్లూరు జిల్లాకి అధ్యక్షుడిగా పనిచేయడం జరిగింది. ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పించిన జిల్లా రాష్ట్ర నాయకులకు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్‌కి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌కి ప్రత్యేక ధన్యవాదాలు విజయ్ భాస్కర్ తెలియజేశారు.

## సర్ ఫార్మ్‌ను భర్తీ చేసి వీఆర్వోలకు ఇవ్వండి



వెంకటగిరి, జూలై 9 ప్రభాతవార్త: సర్ ఫార్మ్‌ను భర్తీ చేసిన సర్పంచ్ ఓటర్లు వెంటనే బిఎల్‌ఓలకు అందజేయాలని ఈఆర్‌ఓఎస్ భారత్ నాయక్ కోరారు. ఎన్నికల నమోదు కార్యక్రమాన్ని పట్టణంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు బూత్ లెవల్ అధికారులను వారి పరిధిలో సందర్శించి, జరుగుతున్న సర్ ప్రక్రియను సమీక్షించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఎన్నికల నమోదు అధికారి, కమిషనర్ ఈ. కిరణ్,ఎన్నికల విధుల తహసీల్దార్, అదనపు అసిస్టెంట్ ఎన్నికల నమోదు అధికారి పి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటారు : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూలై 9 ప్రభాతవార్త: టిడిపి పార్టీ కార్యకర్తలు నాయకులకు తన వంతు అండగా ఉంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని టిడిపికి చెందిన శ్రీకాళహస్తి ఆలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు కౌసల్యమ్మ భర్త ఇటీవల మరణించడంతో ఉత్తర క్రియల్లో ఎమ్మెల్యే, టిడిపి నాయకులు పాల్గొన్నారు. టిడిపి పార్టీ వారికి ఏ సమస్య వచ్చినా పార్టీ, తాను అండగా ఉంటానని. కౌసల్యమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కౌసల్యమ్మ భర్త చిత్రపటం వద్ద పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ పట్టణ అధ్యక్షులు మంకు ఆనంద్, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్లో... ఆరు నెలలుగా పని చేయని డిస్ప్లే



వెంకటగిరి, జూలై 9 ప్రభాతవార్త: వెంకటగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఆరు నెలలుగా డిస్ప్లే పని చేయక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు భోగిల నంబర్లు తెలిపే డిస్ప్లే ఆరు నెలల నుండి పనిచేయడం లేదు. నిత్యం తిరుపతి నుండి హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నం, నర్సాపూర్ వంటి పట్టణాలకు రైలు వెంకటగిరి మీదనే వెళుతున్నాయి. డిస్ప్లే పని చేయకపోవడం వల్ల రైలు బోగీలు ఎక్కడ వస్తాయో అర్థం కాక ప్రయాణికులు 6 నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఎలక్ట్రానిక్ డిస్ప్లేలను తొలగించారు. రైలు భోగి ఎక్కడ వస్తుందో తెలియక ప్రయాణికులు నిత్యం రైలు ఆగిన తర్వాత పరుగులు తీయాల్సి వస్తోంది. వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీ గురుమూర్తి వెంకటగిరి రైల్వేస్టేషన్లో డిస్ప్లే పని చేయడం లేదని రైల్వే జిఎం దృష్టికి తీసుకొని వెళ్లారు. డిస్ప్లే ఏర్పాటు చేస్తామని జిఎం చనిపోయినట్లు తెలిసింది. త్వరగా డిస్ప్లే ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు.

## తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యం : మౌనిక



వెంకటగిరి, జూలై 9 ప్రభాతవార్త: గ్రామాలు, పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు మౌనిక ఫౌండేషన్ లక్ష్యమని చైర్మన్ మోనిక రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం బంగారుపేటలోని రెండో వార్డులో ఎన్సిసి ఫౌండేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌనిక ఫౌండేషన్ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థుల చదువుకు ఎంసిఎఫ్ ద్వారా తగు సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో కూడా వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు తమ వంతు సేవ అందించడమే లక్ష్యమని చెప్పారు. వాటర్ క్యాన్లు కూడా ఆమె ఉచితంగా పంపిణీ చేశారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

తిరుపతి హెల్త్, జూలై 9 ప్రభాతవార్త: శీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం తిరుపతి భైరాగిపట్టెడ అర్బన్ పిహెచ్సీలో భైరాగిపట్టెడ 2,3 సచివాలయాల పరిధిలోని ప్రజలకు పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై డాక్టర్లు చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో భైరాగిపట్టెడ అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రేష్ట, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, డాక్టర్ మేఘన, ఏఎన్ఎంలు రేఖమ్మ, శ్రీదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.